LN MEDIA PUBLICATION PVT LTD
మన మీ వార్త MV NEWS

@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం
16 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :105
పేజీలు : 12 వెల : 5/-




PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

## ఢిల్లీలో సీజేపీ నిరసన..

# అడ్డుకోలేమన్న హైకోర్టు



- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం



## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే

# ఉపేక్షించబోం

- యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు
- ఇన్‌ఛార్జులుగా ఐదుగురు ఐఏఎస్‌ల నియామకం
- యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు
- నిర్లక్ష్యంగా వ్యవహరించారని సీఈని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- విద్యుత్ అంతరాయాలపై సీఎం ఆగ్రహం

## యాసంగిలో వరి పంట

# వేయొద్దు

**తాగు, సాగునీటితో పాటు విద్యుత్ సమస్య ఎదుర్కోబోతున్నాం**

**ఎల్‌నినో పరిస్థితులకు అంతా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన**



- రాబోయే రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరిక
- ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై సీఎం రేవంత్ రెడ్డి చర్చ
- అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు
- మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి
- కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలి

హైదరాబాద్

ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి ఎలాంటి సహాయం పొందాలనే అంశంపై చర్చించామని, గతేడాది ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది అన్ని రిజర్వాయర్లలో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా ఈ దేశాన్ని ఆదుకున్నది రైతులు మాత్రమే అని కొనియాడారు. అందుబాటులో ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలని, నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని యాసంగి పంటలు తగ్గించుకోవాలని, ఈ సీజన్‌లో పంటలు పండించటాన్ని వాయిదా వేసుకోవాలని, పెద్ద మనసు చేసుకుని యాసంగిలో వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన - మిగతా 11లో

## 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'

- తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

## కాంగ్రెస్, బీజేపీ

# భారీ స్కెచ్!



- త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.
- మొత్తం 77 మందిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది
- ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది
- ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది.

హైదరాబాద్

తెలంగాణలో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పనితీరుకు పట్టభద్రుల తీర్పును మద్దతుగా మలచుకోవడంతో పాటు, రాబోయే రోజుల్లో రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకత్వం పావులు కదుపుతోంది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ తో పాటు నల్గొండ- వరంగల్- ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. ఈ ఉద్దేశంతో పార్టీ యంత్రాంగాన్ని - మిగతా 11లో



## లక్ష్యం నెరవేరింది..

## నక్సలిజం ముగిసింది

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలి
- ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్ధరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయి
- దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదు
- ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు



- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు



## కరెంట్ కోతలు..

# అధికారులపై నెపమా రేవంత్?

- బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఏర్పాటు చేసుకోకపోవడం, విద్యుత్ రంగంపై సకాలంలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే కరెంట్ కోతల పరిస్థితి ఏర్పడింది
- ప్రభుత్వం చేసిన తప్పులకు అధికారులను బాధ్యులను చేస్తూ సీఎం, మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

# మనం చేసి చూపిద్దాం

- ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం
- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునీకీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు



# సంపాదకీయం

## సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ. 13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి. తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీ గా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

## ఆగ్రహించిన ఫ్రాన్స్ విద్యార్థి!



మరో ఆర్నెల్లలో ఫ్రాన్స్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆ దేశం హైస్కూల్ విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. రాజధాని పారిస్‌లో గత నెల 18న రాజుకున్న ఆందోళన విస్తరించటానికి ఎంతోకాలం పట్టలేదు. వేలాదిమంది విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ అరెస్టు చేయగా... బాష్పవాయు గోళాలు, స్టన్ గ్రెనేడ్‌లు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించటంతో వందలాదిమంది పిల్లలు, ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఉద్యమం వల్ల వేలాది పాఠశాలలు మూతబడ్డాయి. కొన్నిచోట్ల పాఠశాల భవనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పెట్టగా, తమపై సాగిస్తున్న హింసను సమర్థించుకోవటానికి పోలీసులే ఆ పని చేస్తున్నారని ఉద్యమకారుల ఆరోపణ. ఎన్నికలు ముంగిట్లో పెట్టుకుని ఏ ప్రభుత్వమూ జనంతో తగాదా పడదు. కానీ అధ్యక్షుడు ఇమానియేల్ మాక్రాన్ ఇందుకు విరుద్ధం. వరసగా 2017, 2022 అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ఆయన ఎటూ రాజ్యాంగ ప్రకారం మూడో దఫా పోటీ చేయడానికి లేదు. కనుకనే నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నట్టు కనబడుతోంది.

మన దేశంలో ఆమధ్య కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు యూపీ, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్ర తదితరచోట్ల బడుల్ని సందర్శించి పశువుల పాకల్లో తరగతులు నడవడం, టీచర్లు లేకపోవటం, శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో పిల్లలు బిక్కుబిక్కుమంటూ చదువుకోవడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఆ తర్వాత సీజేపీ నేతలపై దాడులు, అరెస్టులు మొదలయ్యాయి. ఎంతో అభివృద్ధి సాధించిందని అందరూ అనుకునే ఫ్రాన్స్‌లో సైతం బడులు ఇలాగే అఘోరించాయని వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. చాలా పాఠశాలలకు టీచర్ల కొరత. దీనికితోడు కూలిన గోడలు, విరిగిన కిటికీలు, లీకవుతున్న పైకప్పులు, సరిగా పనిచేయని హీటింగ్ వ్యవస్థలు వెక్కిరిస్తున్నాయి. తరగతి గదులు కిక్కిరిసిపోతున్నాయని, అందువల్ల టీచర్లు శ్రద్ధ పెట్టలేకపోతున్నారని పిల్లల ఆరోపణ. ఫ్రాన్స్‌లో ప్రత్యేక శ్రద్ధ అవసరమైన ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి 12నుంచి 24మంది లోపు పిల్లలుండాలని, సాధారణ పాఠశాలల్లో ఈ సంఖ్య 22--26 మధ్య ఉండొచ్చని నిర్దేశించారు. చిత్రమేమంటే ఈసారి అధికారంలోకి రావాలని ఆరాటపడే లీపెన్ నేతృత్వంలోని అతి మితవాద పక్షం విద్యార్థుల్ని తప్పుబడుతోంది. పాలకులు నియంతలైనప్పుడు తిరగబడాలని ప్రపంచానికి బోధించింది ఫ్రాన్సే. రాజరికాన్నీ, భూస్వామ్య వ్యవస్థనూ సమాధి చేసిన బాస్టిల్ కోట ముట్టడి 1789 జూలై 14న పారిస్‌లో జరిగిన భారీ ర్యాలీ పర్యవసానమే. అంతవరకూ ప్రపంచ చరిత్రలో జనం ఇలా సామూహిక ప్రదర్శన నిర్వహించిన దాఖలా లేదు. 1968లో పతనమవుతున్న విద్యాప్రమాణాలనూ, ఉన్నత విద్యాసంస్థల్లో సదుపాయాల లేమినీ ప్రశ్నిస్తూ విద్యార్థులు భారీ ఉద్యమాన్ని నిర్వహించారు. డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదనను నిరసిస్తూ 2018--2020 మధ్య జరిగిన 'యెల్లో వెస్ట్' ఉద్యమం సాగింది. ఈ ఉద్యమాల నుంచి ప్రస్తుత పాలకులు నేర్చుకున్నదేమీ లేదు. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగాక ఫ్రాన్స్ రెండో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయినా విద్యారంగం గుడ్లు తేలేస్తున్నది. అంతేకాదు... వైద్యం, పెన్షన్లు, ఇతర సామాజిక సేవా రంగాలూ నానాటికీ క్షీణిస్తున్నాయి. మరోపక్క రక్షణ రంగానికి కేటాయింపులు భారీగా పెరిగాయి. మాక్రాన్ తొలి ఏలుబడి నాటికి 3,500 కోట్ల డాలర్లుండే రక్షణ బడ్జెట్ ఇప్పుడు 7,100 కోట్ల డాలర్లు! రష్యాను 'ఎప్పటికైనా' జయించాలన్న తాపత్రయంతో నాటో భాగస్వామ్య దేశాలన్నిటికీ ఈ ఉన్మాదం పట్టుకుంది. ఫ్రాన్స్ అప్పు 3 లక్షల 60 వేల కోట్ల డాలర్ల పైమాటే. దాని జీడీపీలో ఇది 119 శాతం. బడ్జెట్ లోటు జీడీపీలో 5.4 శాతం. ఈయూ విధించిన పరిమితి కేవలం 3 శాతం. ప్రభుత్వం ఖర్చుల కోసం బాండ్లు వేలం వేస్తే కొనే నాథుడే లేడంటే పరిస్థితి ఎంత దిగజారిందో తెలుస్తుంది. ఫ్రాన్స్ వాలకంతో ఈయూ సభ్య దేశాలు లబోదిబోమంటున్నాయి. ఆ సంక్షోభం వల్ల యూరో విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని మొత్తుకుంటున్నాయి. అందుకే ఈ పార్లమెంటు సమావేశాల్లో 'కఠినమైన బడ్జెట్ కోతలు' విధించటానికి ప్రభుత్వం సిద్ధపడుతుండగా, ఈలోగా విద్యార్థి ఉద్యమం వచ్చిపడింది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనకపోతే ఈ సంక్షోభం మరింత విస్తరిస్తుంది.

## సౌదీపై హౌతీ దాడులు



పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ యుద్ధ జ్వాలలు చల్లారకముందే సౌదీ అరేబియాహౌతీల మధ్య ఘర్షణ మళ్లీ తీవ్రరూపం దాల్చడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. యెమెన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, ప్రాంతీయ ఆధిపత్య పోరు, ఇరాన్‌సౌదీ పోటాపోటీ వైఖరి ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. కాల్పుల విరమణలు, దౌత్య చర్చలు, మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో కొంతకాలం కనిపించిన ప్రశాంతత శాశ్వత శాంతికి దారితీయకపోవడం ఈ ప్రాంతంలోని అస్థిరతకు అద్దం పడుతున్నది. ఒకవైపు ఇజ్రాయెల్‌పాలస్తీనా సంక్షోభం, మరోవైపు ఎర్ర సముద్రంలో నౌకలపై దాడుల ముప్పు, ఇంకోవైపు గల్ఫ్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం పోటీ.. ఈ పరిణామాల మధ్య సౌదీహౌతీ ఉద్రిక్తతలు పెరగడం ఏమాత్రం వాంఛనీయం కాదు. ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరా, ఆహార భద్రత, అంతర్జాతీయ దౌత్యసంబంధాల మీదా ఈ ఘర్షణ తీవ్ర ప్రభావం చూపే ప్రమాదమున్నది. 2022లో యెమెన్ ప్రభుత్వం, తిరుగుబాటుదారుల మధ్య కుదిరిన సంధితో సౌదీ అరేబియా, హౌతీల మధ్య ప్రత్యక్ష ఘర్షణలు కొంతకాలం తగ్గుముఖం పట్టినప్పటికీ, యెమెన్ అంతర్యుద్ధానికి శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. ఈ ఏడాది జూలైలోనే క్షిపణి దాడులు మళ్లీ మొదలయ్యాయి. అక్టోబర్‌లో పరిస్థితి మరింత విషమించింది. సౌదీ రాజధాని రియాద్ విమానాశ్రయంపై దాడులు, చమురు, మౌలిక సదుపాయాలపై క్షిపణుల ప్రయోగం, సౌదీ ప్రతిదాడులతో ఉద్రిక్తతలు ప్రమాదకర స్థాయికి చేరాయి. ఈ నెల 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హౌతీలు దాడి చేశారు. సౌదీ విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తామని హౌతీలు హెచ్చరించడం గమనార్హం. ఈ ఘర్షణల వెనుక ప్రాంతీయ శక్తుల ప్రయోజనాలు, ఇరాన్‌సౌదీ విభేదాలు, అమెరికా పాత్ర, ఎర్ర సముద్రంపై నియంత్రణ వంటి అనేక అంశాలు ఉన్నాయి. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉండగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా అండగా నిలబడుతున్నది. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా చమురు క్షేత్రాలు, శుద్ధి కేంద్రాలు, ఎగుమతి టెర్మినళ్లు, విమానాశ్రయాలపై దాడులు కొనసాగితే ఉత్పత్తి, రవాణా, సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగి, ఆర్థిక రంగంపై ఒత్తిడి తేవడం కనిపిస్తున్నది. ఇక్కడ మరో కీలక భౌగోళిక అంశం బాబ్ ఎల్ మందెబ్ జలసంధిలో హౌతీలు జరుపుతున్న దాడులు. సౌదీ అరేబియా సహా గల్ఫ్ దేశాల నుంచి చమురు, ఇతర సరుకుల రవాణాలో జలసంధికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్నది. ఈ మార్గంలో నౌకలపై దాడులు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాల్సి వస్తున్నది. దీనివల్ల పెరిగే అదనపు భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుంది. భారీ ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశానికి ఇది చిన్న సమస్య కాదు. ఈ ఘర్షణల నిలిపివేతకు, యెమెన్‌లో శాశ్వత శాంతికి ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఐక్యరాజ్యసమితితో పాటు, ఒమన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి చురుకైన పాత్ర పోషించాలి. ప్రపంచం మరో విస్తృత యుద్ధాన్ని భరించే స్థితిలో లేదు.

## మరో కేంద్ర మంత్రి రాజీనామా ? కొత్త టీం ఎప్పుడు?

**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ హఠాత్తుగా తన పదవితో పాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం కలకలం రేపింది. తమిళనాడులో బిజెపి మూలాలను పటిష్టం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేసేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. సాధారణ రోజు కూలీల కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రధాని మోదీ మంత్రివర్గంలో భాగస్వామ్యం కల్పించడం గొప్ప గౌరవమని, ఇకపై పార్టీ ఆర్గనైజేషన్‌కు తన సమయాన్ని కేటాయిస్తానని ఎక్స్ వదికగా వేసిన పోస్ట్‌లో మురుగన్ స్పష్టం చేశారు. మురుగన్ వైదొలగడం కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో మోదీ 3.0 సర్కార్‌లో జరగబోయే భారీ మంత్రివర్గ విస్తరణ కు ఇది ప్రధాన సంకేతమని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా కేంద్ర మంత్రివర్గంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటు న్నాయి. రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టూ, జార్జ్ కురియన్ తమ పదవులకు రాజీనామా చేయగా, హర్దీప్ సింగ్ పురీ, బి.ఎల్. వర్మ వంటి సీనియర్లను పార్టీ రాజ్యసభకు పునరుద్ధరించలేదు. మరోవైపు సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను దిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించడంతో ఒక వ్యక్తికి ఒకే పదవి నిబంధన ప్రకారం ఆయన కూడా మంత్రిపదవి నుంచి తప్పుకోనున్నారు. ఇలా దాదాపు అరడజనుకు పైగా కేంద్ర మంత్రి పదవులు ఖాళీ కావడంతో, ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో భారీ రీ-షఫుల్‌కు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, అలాగే 2029 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలకు అనుగుణంగా కేంద్ర క్యాబినెట్‌లో ప్రాంతీయ, సామాజిక సమతుల్యతను దెబ్బతినకుండా చూసేందుకు బిజెపి అగ్రనాయకత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపేలా స్థానిక నాయకులను సంస్థాగత బాధ్యతల్లోకి మళ్లిస్తూ, లోక్‌సభ సభ్యులుగా ఉన్న కొందరు సీనియర్లకు కేంద్రంలో అవకాశం కల్పించవచ్చని ప్రచారం సాగుతోంది. మురుగన్ లాంటి సీనియర్ నేతలను తిరిగి క్షేత్రస్థాయికి పంపి, కేంద్రంలో ఖాళీ అయిన స్థానాలను కొత్త ముఖాలతో భర్తీ చేసేందుకు వీలుగా దిల్లీ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, పార్టీ యంత్రాంగాన్ని రాబోయే ఎన్నికల కోసం సన్నద్ధం చేయడమే లక్ష్యంగా మోదీ-అమిత్ షాల ద్వయం ఈ మంత్రివర్గ విస్తరణ వేదికగా కొత్త వ్యూహాలను అమలు చేయబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# కోట గల్లి గర్ల్స్ గవర్నమెంట్ హైస్కూల్ నే తెలంగాణ పబ్లిక్ స్కూల్

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 15, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థలం ఖరారు అయింది. నిజామాబాద్ నగరంలోని దశాబ్దాల చరిత్ర కలిగిన కోట గల్లి బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కానుంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం తో మంజూరు చేసినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కలిసి గురువారం ఉదయం నగరంలోని కోటగల్లి బాలికల ప్రభుత్వ పాఠశాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జిల్లాలో రెండు పబ్లిక్ స్కూల్ లను ఎంపిక చేశారన్నారు. ఇందులో భాగంగా అర్బన్ నియోజకవర్గం కు సంబంధించి నగరంలో బాలికల





ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపిక చేయడం జరిగిందన్నారు.

తాను గతంలో అనేక సార్లు పాఠశాల పరిశీలించడం జరిగింది, ఇక్కడి పరిస్థితిని చూసి పబ్లిక్ స్కూల్ కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని గుర్తుచేశారు. పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అయితే నిధులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసి, టెండర్లను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులో తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భుజంగరావు, మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, బీజేపీ కార్పొరేటర్ ప్రసన్న శ్యామల , నాగోల్ల లక్ష్మీనారాయణ, చింతకాయల రాజేందర్, అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ ధమ్మ క్రాంతి శ్రామణేర శిక్షణ శిబిరం ను సందర్శించిన గడుగు గంగాధర్

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 15, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా , సమతా సైనిక్ దళ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రామినేర్ శిభిరంను తెలంగాణ రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ సందర్శించారు. గురువారం నగరంలోని బుద్ధవిహార్ లో జరుగుతున్న శిభిరంలో అంబేద్కర్ విగ్రహం కు గడుగు గంగాధర్పులమాలలు వేసి .నివాళ్లర్పించారుఈ పవిత్ర శిబిరానికి భంతే బుద్ధ ఘోష్ థేరో ,భంతే నాగభూషణం, భంతే సాగర బోధి,భంతే నాగ వజ్ర, భిక్కుణి ఖే మాజీ వారు ధమ్మ మార్గంలో స్ఫూర్తిని అందిస్తున్నారు. బౌద్ధుల చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వమైన మహా బోధి మహా విహార్ విముక్తి కోసం ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ, బౌద్ధుల హక్కుల సాధనకు కృషి చేద్దాం అని గడుగు గంగాధర్ పిలుపు నిచ్చారు. సమతా సైనిక్ దళ్ శతాబ్ది ఉత్సవాల





స్ఫూర్తితో క్రమశిక్షణ, సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం అనే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం అన్నారు. బౌద్ధ వారసత్వ పరిరక్షణకు సంకల్పం, ఇది సమతా సైనిక్ దళ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే ప్రేరణ అన్నారు. మహా బోధి మహా విహార్ విముక్తి ఉద్యమం విజయవంతం కావాలి, సమతా సైనిక్ దళ్ ఆశయాలు ప్రతి ఇంటికి చేరాలి అని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డా పులి జైపాల్, బిఎస్ఐ ఉపాధ్యక్షులు అశోక్ భాగ్యవాన్, మల్లనీ శివ, శ్రీధర్, సిద్ధు భాగ్య వన్ సుదర్శన్ తదితరులు హాజరయ్యారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలిసిన బిజెపినాయకులు

– సైడ్ డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి కోటి నిధులు కేటాయించాలని వినతి

– బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్

చిట్యాల అక్టోబర్15 (మీవార్త) :

చిట్యాల గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సైడ్ డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ. కోటి మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటమ్ లక్ష్మీ అత్తయ్య సూచనల మేరకు గురువారం రోజున చిట్యాల మండలం బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వరంలో బిజెపి నాయకులతో కలిసి వారిని కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు

ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ చిట్యాల గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైడ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అంతర్గత రహదారుల అభివృద్ధి లేకపోవడంతో గ్రామ ప్రజలు రాకపోకల్లో సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు.



గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు



గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సైడ్ డ్రైనేజీల నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధి పనుల కోసం ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ. కోటి మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధుల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు రావుల రాకేష్, మైదం శ్రీకాంత్, కేంసారపు ప్రభాకర్, ఉండ మణికుమార్, బుర్ర రాహుల్‌తో పాటు దుర్గామాత మాలధారణ చేసిన భక్తులు బుర్ర రణధీర్, బుర్ర రితేష్, బుర్ర అరవింద్, బుర్ర కృష్ణ, బుర్ర అవినాష్. తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల తాండాలకూ మిషన్ భగీరథ జలాలు

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 15, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

మారుమూల తాండ ప్రాంతాలకు సైతం మిషన్ భగిరథ ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మోపాల్ మండలం అమ్రాబాద్ తండాను కలెక్టర్ గురువారం సందర్శించారు. మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణంలో పలు తండాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఇదివరకు అమ్రాబాద్ తండా సహా సుమారు 11 నివాస ప్రాంతాలకు మిషన్ భగీరథ పైప్ లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రస్తుతం



ఆ ప్రాంతాలకు మిషన్ భగీరథ జలాలు అందించేందుకు వీలుగా అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు కలెక్టర్ క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పూర్తిగా బోరుబావుల పైనే ఆధారపడి జీవనాలు వెళ్ళదీస్తున్నామని ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని నివాస ప్రాంతాలకు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా అనుకూలమైన ప్రదేశంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలకు తాగునీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చి జల్ జీవన్ మిషన్ కింద కవర్ అయ్యేలా చూడాలన్నారు. కాగా, ఎల్ నినో ప్రభావం వల్ల ఆశించిన రీతిలో వర్షాలు కురియక నీటి నిల్వలు అంతంతమాత్రంగానే అందుబాటులో ఉన్నాయని, భూగర్భ జలమట్టం సైతం



దిగువకు పడిపోయినందున ఖరీఫ్ లో ఆరుతడి పంటలే సాగు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా స్థానిక రైతులకు సూచించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పప్పుదినుసులు, మొక్కజొన్న, జొన్న వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, మోపాల్ తహసిల్దార్ రేఖ, స్థానిక సర్పంచ్ ప్రియాంక తదితరులు ఉన్నారు.

## డి ఆర్ యూసిసి సభ్యుడిగా గోండాల సురేష్ బాబు

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 15, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలోని డివిజన్ ల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ( డిఆర్ యూసిసీ) సభ్యుడిగా నిజామాబాద్ నగరానికి చెందిన గోండాల సురేష్ బాబు నియమితులు అయ్యారు.




SOUTH CENTRAL RAILWAY
Office of the Divisional Railway Manager, Commercial Branch, Hyderabad Division, SECUNDERABAD - 500025
No. Y/C.222/DRUCC/Re-Consta/2026-27. Dated: 13.10.2026.
Shri Gondala Suresh Babu,
(Nominated by Shri Arvind Dharmapuri, MP),
NIZAMABAD District, TG - 503001
Dear Sir,
Sub: Reconstitution of Divisional Railway Users' Consultative Committee (DRUCCs) over Hyderabad Division, South Central Railway for the period from 01.09.2026 to 31.08.2028 - Intimation of Approval - Reg.
I am pleased to inform that, the General Manager/South Central Railway has nominated you to serve as a Member of Divisional Railway Users Consultative Committee (DRUCC) of Hyderabad Division, South Central Railway, Secunderabad for a term of two years i.e. from 01.09.2026 to 31.08.2028.
It is requested to communicate your acceptance for the membership of the above committee along with duly filled declaration form and also send two stamp size latest photographs for issuing of Identity Card.
A copy of declaration is enclosed herewith.
Enc: As above.
Yours Sincerely,
(K.GOVINDA RAO)
ACM-II/HYB
For Senior Divisional Commercial Manager,
Hyderabad Division, Secunderabad.
Copy to: CCI/HYB for information and necessary action.

నగరంలోని గాజుల్ పేట్ కు చెందిన సురేష్ బాబు బిజెపిలో సినియర్ నాయకుడిగా ఉన్నారు. గతంలో 11 వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా పోటీ చేసి ఓడిపోయారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి డిఆర్ యూసిసి సభ్యుడిగా గోండాల సురేష్ బాబు పేరును ప్రతిపాదించగా దక్షిణ మధ్య రైల్వే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.దక్షిణ మధ్య రైల్వే డి ఆర్ యూసిసి సభ్యుడిగా నియామకం పొందిన గోండాల సురేష్ బాబు తన నియామకానికి సహకరించిన, ఈ అవకాశం కల్పించిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, రైల్వే అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని అన్నారు.

## మేడ్చల్ జిల్లా BJYM కార్యదర్శిగా నియామకం - నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన యువ నేత

జవహర్ నగర్, అక్టోబర్ 15: (వార్త ప్రతినిధి)



గత 15 ఏళ్లుగా భారతీయ జనతా పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్న తనను గుర్తించి మేడ్చల్ జిల్లా భారతీయ జనతా యువ మోర్చా (BJYM) కార్యదర్శిగా ఎ.నవీన్ కురుమ నియమించడం పట్ల ఆ యువ నేత హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించడంలో సహకరించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు బుద్ధి శ్రీను, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్, తన మార్గదర్శి గురువర్యులు ఉడుత సంతోష్, జిల్లా దీజీవీ అధ్యక్షులు రాగం అర్జున్, చంద్రపురి కాలనీ అధ్యక్షులు జోగరావు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే తనకు అండగా నిలిచిన తోటి అన్నదమ్ములకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, బీజేపీ కుటుంబ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి, యువత చైతన్యానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో వైభవంగా మహా చండీ హోమం

– ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 15 ( మన మీ వార్త):

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పల్ భగాయత్‌లోని గోనె ప్రభాకర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన మహా చండీ హోమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక





వాతావరణంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. నవరాత్రి పర్వదినాల్లో నిర్వహించిన మహా చండీ హోమంతో పరిసర ప్రాంతంలో భక్తిభావం వెల్లివిరిసింది. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సల్ల ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం చేసిన చేనేత కార్పొరేషన్ చైర్మన్

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 15 :




చేనేత కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దూడం వెంకటరమణ నూతన కార్యాలయం హైదరాబాద్ నాంపల్లి చేనేత భవన్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ప్రారంభించారు. తదనంతరం..చేనేత కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దూడం వెంకట రమణ ప్రమాణ స్వీకారం చేశారు.తర్వాత శ్రీ దూడం వెంకట్ రమణ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గారిని పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కమలాకర్ ,వరంగల్ జిల్లా డీసీసీ కార్యదర్శి, టిపిసిసి కరీంనగర్ జిల్లా చేనేత సెల్ అధ్యక్షులు బండారి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## దసరా వేళ సేవా కార్యక్రమాలు నిర్వహించిన గిరి బ్రదర్స్ - ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్ యాజమాన్యం

- గిరి నరసింహ మరియు గిరి మహేష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

**ఉప్పల్, అక్టోబర్ 15 ( మన మీ వార్త):**





దసరా పండుగ సందర్భంగా ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్ యాజమాన్యం, గిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ నిర్వహించారు. గిరి నర్సింహా, గిరి మహేశ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.పట్టణ పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి చీరలు అందజేయడంపై పలువురు అభినందించారు. పండుగ సందర్భంగా తమను సత్కరించడం సంతోషంగా ఉందని కార్మికులు తెలిపారు. వారి సంఘం ప్రతినిధులు గిరి బ్రదర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**- ప్రతి నెలా అన్నదానం**

గిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్‌లో ప్రతి నెలా పేదల కోసం అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడంతో పాటు ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేదలకు సహాయం చేయడం, కార్మికులను గౌరవించడం వంటి కార్యక్రమాలు సామాజిక సేవాభావాన్ని పెంపొందిస్తాయని స్థానికులు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.. పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, అక్టోబర్ 15 ( మన మీ వార్త):**

ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, డివిజన్ కోఆర్డినేటర్ యాదగిరి గారి ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు హాజరయ్యారు.పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి అని కాంగ్రెస్ శ్రేణులకు పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గారి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కాలనీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, వారి వివరాలను సేకరించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉప్పల్ డివిజన్‌లోని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీలో జాప్యం.!

**తూప్రాన్ / మనోహరాబాద్ అక్టోబర్ 15 మన మీ వార్త ప్రతినిధి**





బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు పంపిణీ చేయాల్సిన చీరలు సకాలంలో అందజేయకపోవడంతో అసహనం వ్యక్తం అవుతున్న మహిళలు తూప్రాన్ సమీకృత భవనంలో సుమారు 4 వేల బతుకమ్మ చీరలు నిల్వ ఉండిపోయాయి పండుగ వచ్చి చీరల పంపిణీ చేపట్టకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మరోవైపు నిల్వ ఉంచిన చీరలను ఎలుకలు కొరుకుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేసేది ఈ సంవత్సరం పండుగకు ముందే అందాల్సిన చీరలు ఇప్పటికీ రాకపోవడంతో మహిళలు నిరాశకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పంపిణీలో జాతీయం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

పండుగ ముగిసిన తర్వాత చీరలు పంపిణీ చేస్తారా ? గోదాముల్లో నిల్వ ఉన్న చీరలకు రక్షణ కల్పించలేరా ? పంపిణీలో జాప్యాయానికి బాధ్యులెవరు ? అంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చీరల పంపిణీ పై స్పష్టత ఇవ్వాలని అర్హులైన మహిళలకు చీరలను తక్షణమే అందజేయాలని స్థానికులు కోరుతున్నారు. నిల్వ ఉంచిన చీరలు ఎలుకల బారి నుంచి రక్షించాలని అలాగే పంపిణీలో జాబియానికి గల కారణాలను త్వరగా వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నియోడైమియం మ్యాట్రెస్ తో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు...!

**వరంగల్ (మీవార్త ప్రతినిధి ) :**

నియోడైమియం మాగ్నెటిక్ మ్యాట్రెస్ ను సెల్ వాడుతున్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వాడాల్సిందే. నియోడైమియం మాగ్నెటిక్ మ్యాట్రెస్ ఉపయోగించడమనేది నేచురల్ హీలింగ్ థెరపీ (Natural Healing Therapy) లేదా ప్రకృతి వైద్యం. కృత్రిమ మందులు, రసాయనాలు ఉపయోగించకుండా, కేవలం ప్రకృతి సిద్ధమైన పద్ధతులు, జీవనశైలి మార్పుల ద్వారా శరీరాన్ని తానే స్వయంగా నయం చేసుకునేలా (Self-Healing) ప్రోత్సహించే ఒక సంపూర్ణ ఆరోగ్య విధానం. ఇది కేవలం రోగ లక్షణాలకే కాకుండా, మనిషి యొక్క శారీరక, మానసిక, మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుంది. మంచి రక్త ప్రసరణ జరుగుతుంది. గుండె పోటు రాకుండా ఉపయోగపడుతుంది. గుండె పనితీరు మెరుగుపరుచుతుంది. నరాల బలహీనత, కీళ్ళ నొప్పులు, మెడ నరాల గుంజడం, నడుం నొప్పి, కండరాల బలహీనత, గురక నివారణ , అరికాళ్ళ మంటలు మండడం, కళ్ళు చేతులు తిమ్మిర్లు రావడం, అధిక బరువు తగ్గడానికి, ఇలా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులన్న నివారించడానికి బయో మాగ్నెటిక్ పరుపు ప్రతి ఒక్కరు వాడాలన్నారు.గుండెజబ్బులు ,పక్షవాతం వంటివి రాకుండా నివారిస్తుంది. వచ్చిన రోగాలను క్రమక్రమేణా తగ్గిస్తుంది. శరీరంలో రక్తప్రసరణను ఆక్సీజన్ లెవల్స్ పెంచుతుంది. మెదడు పనితీరును మెరుగు పరుస్తుంది. ఒత్తిడిని (Stress) దూరం చేస్తుంది. దృష్టి లోపాలను సరిచేస్తుంది. పిల్లలలో పెరుగుదలను వృద్ధి చేస్తుంది. జ్ఞాపక శక్తిని పెంచుతుంది. శరీరాన్ని అలసి పోకుండా చేస్తుంది. గాఢ నిద్ర పట్టడంలో సహకరిస్తుంది. రేడియేషన్ నుండి కాపాడుతుంది. భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుంది.




**బయో మాగ్నెటిక్ ఎనర్జీ వాటర్ ప్యాడ్ ఉపయోగాలు**

బయో మాగ్నెట్లు నీటి పరమాణు నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేస్తాయి మరియు దానిని మైక్రో క్లస్టర్ గా మరియు సెల్యులార్ బాడీ ద్వారా సజావుగా గ్రహించేలా చేస్తుంది. బయో మాగ్నెటిక్ ఎనర్జీ వాటర్ హైడ్రేషన్ ను పెంచుతుంది, ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది మరియు వ్యాధుల నుండి నివారిస్తుంది.

90% వ్యాధులు మరియు రుగ్మతలకు కారణాలు పేలవమైన రక్త ప్రసరణ మరియు శరీరంలో తక్కువ ఆక్సిజన్ స్థాయిలు. బయో మాగ్నెటిక్ వాటర్ ఎనర్జీ ప్యాడ్ శరీరంలో రక్త ప్రసరణ మరియు ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరుస్తుంది. మంచి రక్త ప్రసరణ వివిధ వ్యాధులు మరియు రుగ్మతల నుండి నిరోధిస్తుంది మరియు రివర్స్ చేస్తుంది. ఊపిరితిత్తుల నొప్పి థైరాయిడ్ ,వెన్నునొప్పి,మధుమెహం నుండి ఉపశమనం కీళ్ళనొప్పులు తలనొప్పి శరీర నొప్పి గుండె సమస్యలు లైంగిక జీవితాన్ని పెంచుతాయి ఆస్తమా ,అధిక రక్తపోటు తక్కువ రక్తపోటు పక్షవాతం, ఊబకాయాన్ని నియంత్రిస్తుంది.

**తల కింద పెట్టుకునే మ్యాగ్నెటిక్ ఫిల్లోతో ఉపయోగాలు :**

మెడ, భుజాల నొప్పులు సెర్వికల్ స్పాండిలైటిస్ మరియు భుజాల నొప్పులు ఉన్నవారికి ఉపశమనం కలిగిస్తుంది. తలనొప్పి, మైగ్రేన్ తల భాగంలో రక్తప్రసరణను క్రమబద్ధీకరించి తరచుగా వచ్చే తలనొప్పులను తగ్గిస్తుంది.
ఈ దిండ్లలో ప్రత్యేకంగా అమర్చిన అయస్కాంతాలు (Magnets) ఉంటాయి. ఇవి మనం పడుకున్నప్పుడు తల మరియు మెడ భాగానికి అయస్కాంత శక్తిని అందిస్తాయి.

మెడ మరియు భుజాల నొప్పుల ఉపశమనం: నిద్రపోయే సమయంలో మెడ, భుజాలు మరియు వెన్నుపాము పైభాగానికి మంచి సపోర్ట్ అందించి, నరాల ఒత్తిడిని మరియు కండరాల నొప్పులను తగ్గిస్తుంది.

**తలనొప్పి మరియు మైగ్రేన్ నివారణ:**

తల భాగంలో రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా తరచుగా వచ్చే తలనొప్పి, మైగ్రేన్ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. మంచి నిద్ర (QualitySleep ): మానసిక ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించి, మైండ్ రిలాక్స్ అవ్వడానికి సహాయపడుతుంది. దీనివల్ల నిద్రలేమి సమస్య ఉన్నవారికి త్వరగా గాఢ నిద్ర పడుతుంది. గురక తగ్గించడం సరియైన పోశ్చర్ అందించడం ద్వారా శ్వాసనాళాలు సరిగ్గా తెరుచుకుని, గురక సమస్యను తగ్గించడంలో తోడ్పడుతుంది. స్పాండిలైటిస్ ఉన్నవారికి మేలు: సెర్వికల్ స్పాండిలైటిస్ సమస్యతో బాధపడేవారికి మెడ భాగంలో ఒత్తిడి పడకుండా ఉపశమనం ఇస్తుంది.

## ఉప్పల్ బీరప్ప గడ్డ స్మశానవాటిక అభివృద్ధికి రూ. 2 కోట్ల నిధులు మంజూరు







- బీరప్పగడ్డ , గ్రేవ్ యార్డ్ నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలను అందచేసిన పరమేశ్వర్ రెడ్డి

**బీరప్ప గడ్డ, అక్టోబర్ 15 ( మన మీ వార్త):**

బీరప్ప గడ్డ డివిజన్ గౌడ స్మశానవాటిక అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించినట్లుగా మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ గౌడ సంఘం సభ్యులకు,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరుకు సంబంధించిన ప్రోసిడింగ్ పత్రాలను అందజేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాలతో ఈపటికే ఉప్పల్ నియోజకవర్గం లో ఉన్న శ్మశానవాటికలకు భారీగా నిధులు మంజూరు చేయించినట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నట్టుగా చెప్పారు.అందులో భాగంగానే
ఉప్పల్ కుమ్మరి సంఘం -- రూ. 25 లక్షల నిధులు,ఉప్పల్ కుర్మ సంఘం శ్మశానవాటిక -- రూ. 25 లక్షల నిధులు,చిలకానగర్ క్రిస్టియన్ శ్మశానవాటిక -- రూ. 25 లక్షల నిధులు,ఉప్పల్ బ్రాహ్మణ వైశ్య శ్మశానవాటిక -- రూ. 25 లక్షల నిధులు,ఉప్పల్ రెడ్డి శ్మశానవాటిక -- రూ. 25 లక్షల నిధులు,రామంతాపూర్ నేతాజీ నగర్ మరియు రాజేంద్ర నగర్ శ్మశానవాటికలు -- రూ. 72 లక్షల నిధులు, మరియు ఉప్పల్ గౌడ శ్మశానవాటిక కు సైతం 2 కోట్ల నిధుల కేటాయింపు జరిగిందన్నారు.ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టినట్టుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహాటరీత్సవములు ఐదవ రోజు

**మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ఐదవ రోజు కార్యక్రమాలలో భాగంగా ఉదయం గం॥ 04-00లకు అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అమ్మవారిని లలితా మహా త్రిపుర సుందరి గా అలంకరించడానికి అంగీకార ప్రార్థన జరిపి సూచిన వచ్చిన వెంటనే అమ్మవారిని రాజరాజేశ్వరి (లలిత)గా అలంకరించి పూజారాధనలు జరిపారు. మంత్రదీక్ష తీసుకొని సాధకుడు మంత్రానుష్ఠానం చేస్తుండగా అమ్మవారు ఈ సాధకుడు ధనం కోసం అనుష్టానం చేస్తున్నాడేయో ఎందుకంటే ధనమూలమిదం జగత్ అని కదా అందుకోసం సాధకుడి అనుష్ఠానం వల్ల ప్రసన్నమైన అమ్మవారు సాధకుడికి అమితమైన ఐశ్వర్యాన్నిస్తుంది అనటానికి సంకేతంగా నిన్న అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. ఐశ్వర్యం కోసమే సాధకుడి అనుష్టానం అంటే సాధన అక్కడికి అగిపోతుంది. కానీ అమ్మ ఐశ్వర్యం, బీదరికం గత జన్మలో చేసుకున్న పాపపుణ్యాల ఫలితంగా వస్తుంది. పోతుంది ఇవి ఏవి శాశ్వతం కావు. నాకు ఇహలోకంలో నీపాదాల మీద అచంచలమైన భక్తి దేహాంతంలో ముక్తి ప్రసాదించమ్మా అని సాధకుడు కోరుతాడు. ముక్తి అనేది నూరు కోట్ల జన్మల పుణ్యం ఉంటే గానీ దొరకదు అని వివేక చూడామణిలో శంకరాచార్యులవారు తెలిపారు. మరి ముక్తి అనే పదం మిథ్యయేనా! అన్న శంక కలుగుతుంది. అమ్మవారిని ముద్దుస్వామి దీక్షితులు తమ కృతులలో దయాతీతమోక్ష ప్రదచతురే అని కీర్తించారు. దాయకు అతీతమైన ఒక్క మార్దవమైన గణంతో ఆ జగన్మాత భక్తులకు ముక్తి కూడా ప్రసాదిస్తుంది అని దీని అర్థం. అంతేగాక పంచదశీ, షోడశీ మంత్ర దీక్షలు తీసుకున్న వారికి మరుజన్మ వుండదు అని శాస్త్రం చెబుతోంది. కాబట్టి దానికి సంకేతంగా మంత్రాలకు అధిష్టాన దేవతయైన రాజరాజేశ్వరీ (లలిత)గా అలంకరించడంలోని నేపథ్యం. ఈ రోజు అమ్మవారిని స్కందమాతా క్రమం మరియు బోధాయనమహర్షి ప్రోక్త నవరాత్ర కల్పాన్ని అనుసరించి దుర్గమహా క్రమంలోనూ పూజారాధనలు జరిపారు. ఉదయం పల్లకీ సేవ సాయంకాలం శేషవాహన సేవ జరిపారు. పల్లకీ సేవలో అమ్మవారిని దర్శించిన భక్తులకు సమస్త భోగాలు కలుగుతాయి. శేషవాహనంపై సేవింపబడిన అమ్మవారిని దర్శించడం వల్ల యోగసిద్ధి కలుగుతుందని ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు కార్యక్రమాలకు వాగ్దేవి విద్యాసంస్థల అధినేతలు శ్రీ చందుపట్ల దేవేందర్ రెడ్డి-వాణీదేవి, వాహినీదేవి, శ్రీ కళా సారీస్ & ఫ్యాబ్రిక్స్ అధినేతలు శ్రీ పింగిళి పవన్రెడ్డి-శ్రీలత దంపతులు, శ్రీ పల్లె లక్ష్మణావుగౌడ్ సువర్ణ దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం మరియు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత పర్యవేక్షించారు. దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ శ్రీ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు. ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో





దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్ జోన్ డిప్యూటీ కమీషనర్ కృష్ణప్రసాద్ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి రమాదేవి తదితరులున్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం మరియు కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. సాయంకాలం దేవాలయ ప్రాంగణంలో తెలంగాణా ప్రభుత్వముచే నూతనంగా ఏర్పాటు చేయబడిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేయబడినది. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో ఈ.ఓ శ్రీమతి రామల సునీత గారిచే దేవాలయ చైర్మన్ డా॥ బి. శివసుబ్రహ్మణ్యం ధర్మకర్తలుగా కమటం వేణుగోపాల్, శ్రీ కల్లూరి పవన కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీమతి చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్ పేరాల శ్రీనివాసరావు, రమేష్ చందర్ భంగ్, శ్రీమతి చింతలపణి వాసవి రెడ్డి, శ్రీమతి మోతుకూరి మయూరి మరియు ఎక్స్ అఫీషియో మెంబర్ శ్రీ పార్నంది నర్సింహమూర్తిలు ప్రమాణ స్వీకారం చేశారు. రామల సునీత కార్యనిర్వహణాధికారి

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- రంగురంగుల పూలతో బతుకమ్మల పేర్పు.. ఆటపాటలతో మహిళల సందడి





మీ వార్త / కుత్బుల్లాపూర్ :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వంపై గౌరవాన్ని చాటుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ లక్ష్మయ్య, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హన్మకొండ దివ్యాంగుల సహాయ ఉపకరణాల పథకంలో భాగంగా బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో పంపిణీ

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న దివ్యాంగుల సహాయ ఉపకరణాల పథకం 2024--25లో భాగంగా, జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపికైన అర్హత కలిగిన దివ్యాంగ లబ్ధిదారుడు, కమలాపూర్ మండలానికి చెందిన దాసరి శ్రీనివాస్ కి బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటోను పంపిణీ చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లబ్ధిదారునికి తమ చేతుల మీదుగా బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటోను అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వంటి ఉపాధి ఆధారిత సహాయ ఉపకరణాల ద్వారా దివ్యాంగుల జీవనోపాధికి తోడ్పాటు అందించడంతో పాటు, వారి ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ , సీడీపీవో బీమదేవరపల్లి స్వరూప , సీనియర్ అసిస్టెంట్స్ వెంకట్రామ్, కలీమ్ , ఎఫ్ఆర్ ఓ రవి కృష్ణ , రజిత , రాజేష్ , దేవేందర్, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో ఘనంగా చండీ హోమం..

- మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ శ్రీ వి. నవీన్ చంద్ ఐపీఎస్ ప్రత్యేక పూజలు

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 15



హుజురాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరణ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చండీ హోమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ శ్రీ వి. నవీన్ చంద్ ఐపీఎస్ గారు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, పండుగలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వైష్ణవి మురళి మంచికట్ల, దామెర అనుషా - అనురాగ్, గురుస్వామి నటరాజ్ బుర్ర, ఎల్.వి. అర్జున్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో పారదర్శకత పాటించాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

అక్టోబర్ 16,10, 2016 పరకాల ప్రతినిధి మన మీ వార్త :



భూపాలపల్లి జయశంకర్ జిల్లా కొత్తపల్లి గోరి మండలం చెన్నపూర్లోని 263వ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. ఓటరు నమోదు దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువత ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, వివరాల్లో తప్పులుంటే సరిచేసుకోవాలని సూచించారు. శుక్రవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

- హెవీ వెహికల్స్ ఇష్టారీతిన పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.







రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో... జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు భద్రత సంబంధించి చేపట్టిన చర్యల గురించి ఆర్ అండ్ బి ఈఈ దేవిక వివరించారు. కోమటి పల్లి పరిధిలో ఉన్న ఎన్ హెచ్ రోడ్డు పై ట్రక్ లే బై ఏర్పాటు కు చర్యలు , వంగపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్ హెచ్ అధికారులు కలెక్టర్ కు వివరించారు.

ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలకు విరుద్ధంగా హెవీ వాహనాలు, ప్రైవేట్ టాక్సీలు రోడ్ల పక్కన నిలిపి ఉంచడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. రహదారులపై లైన్ మార్కింగ్ సరిగ్గా ఉండాలన్నారు. నూతనంగా బీటీ రోడ్డు వేసిన హసన్ పర్తి వైపు లైన్ మార్కింగ్, స్టడ్స్ ఏర్పాటు చేయాలని ఎన్ హెచ్ అధికారులను ఆదేశించారు. వంగపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ ఎన్. రవి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఎన్ హెచ్ మేనేజర్ లింగయ్య, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ లో పరిమిత సేవలు ఈ నెల 20 నుండి ప్రారంభం
- డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటు
- జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





పేద ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్య ఖర్చుల భారం కారణంగా పేదలు ఇబ్బందులు పడకూడదని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గురువారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తో పాటు తెలంగాణా రాష్ట్ర వైద్యం ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చూంగ్తు, కూడా చైర్మెన్ గుండు సుధారాణి, వరంగల్,హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి,ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి పరిశీలించారు.

అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఇంచార్జ్ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ ప్రజలు అత్యాధునిక వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించి, వరంగల్‌లోనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తోందన్నారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ పేదల ఉచిత వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో దసరా సందర్భంగా అక్టోబర్ 20 నుండి పరిమిత వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. అలాగే నవంబర్ లో మరిన్ని వైద్య సేవలు అంధుబాటులోకి తీసుకువచ్చి డిసెంబర్ నెల చివరికల్లా పూర్తి స్థాయిలో వైద్య సేవలను అందిస్తామన్నారు . ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలే కాకుండా ఖమ్మం ,వరంగల్, నల్గొండ, ఆదిలాబాదు, మహబూబాబాద్, మెదక్ జిల్లాల ప్రజలు ఎన్నవ లో నాణ్యమైన వైద్య అందుతుందని నమ్మకంతో వస్తున్నారని,ఆ నమ్మకాన్ని మరింత బలపడేలా ఉండేందుకు ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కార్పొరేట్ వైద్యానికి దీటుగా ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడం జరిగింది..ఈ నిర్మాణం తుది దశకి చేరుకుందన్ని వారు పేర్కొన్నారు.

ఈ ప్రభుత్వం విద్యకు వైద్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు.

గిరిజన,గురిజనేతరులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రోజుకు సుమారు మూడు వేల మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నామని మంత్రి తెలిపారు.సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రోజుకు నాలుగు నుంచి ఐదు వేల మందికి వైద్య సేవలు అందించే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు.

ఈ పరిశీలనలో డీఎంఈ డా. వాణి, డా విమల థామస్,అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాజి రెడ్డి,ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంకుమార్, ఆర్ఎంఓ డా. అశ్విన్‌తో,వరంగల్ ,నర్సంపేట ఆర్డీవోలు సుమా,ఉమారాణి పాటు ఆరోగ్య, వైద్య, ఇంజినీరింగ్, శాఖలకు చెందిన సంబంధిత అధికారులు, వైద్య అధికారులు , సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# బౌరంపేటలో భూ వివాదం.. పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్‌పై బాధితుల ఆరోపణలు

- నకిలీ పత్రాలతో భూముల ఆక్రమణకు యత్నం.. విచారణ జరిపి న్యాయం చేయాలని వినతి

మీ వార్త / కుత్బుల్లాపూర్ :



బౌరంపేటలోని సర్వే నంబర్ 259లో భూముల ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని భూ బాధితులు ఆరోపించారు. పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి భూములను ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రగతినగర్‌కు చెందిన దయాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితరులపై ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేటలోని సర్వే నంబర్ 259లో ఉన్న ఐదు ఎకరాల 27 గుంటల భూమికి సంబంధించి సతీష్ సొసైటీలో సయ్యద్ రజాక్ కుటుంబ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 1988లో టెనెంట్ సర్టిఫికెట్ కలిగిన పాల్వనూరు చంద్రారెడ్డి నుంచి భూమిని కొనుగోలు చేశామని, అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లుగా తమ ఆధీనంలోనే ఉందని తెలిపారు. అక్కడ ఏపీ గ్లాస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. 2025లో తమ భూమిని స్వాధీనం చేసుకునేందుకు నకిలీ పత్రాలతో ల్యాండ్ కన్వర్షన్ చేయించారని, ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించగా పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందని బాధితులు తెలిపారు. రెండు రోజుల క్రితం వచ్చిన సీపీఎం నాయకులు తమ భూమిలోకి ప్రవేశించి, రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. అధికారులు ఇరువర్గాల పత్రాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. తమ వద్ద తప్పు ఉన్నట్లు తేలితే భూమి నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత వ్యక్తులపై వచ్చిన ఆరోపణలపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎం ఎల్ సి అభ్యర్థిని కలిసిన మడికొండ బ్రదర్స్ ...

అక్టోబర్ 16 ,10, 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :

వరంగల్-ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండ బ్రదర్స్...టీపీసీసీ ఎస్సి సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్. మడికొండ శ్రీను, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ సంపత్ కుమార్, బొజ్జం సాయి కుమార్ తదితరులు.



# యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు.

- టాస్క్ కేంద్రంలో ఈ నెల 31 వరకు పేర్ల నమోదు చేసుకోవాలి.
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రిటైల్ రంగంతో పాటు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు ఉద్దేశించిన రెండు వేర్వేరు శిక్షణ కార్యక్రమాలకు అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 31వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ల్యాండ్‌మార్క్ గ్రూప్ ఫౌండేషన్ సహకారంతో హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ అమలు చేస్తున్న 'మేక్ ఇండియా కేపబుల్' కార్యక్రమంలో భాగంగా యువతకు ఉచిత ఉద్యోగ సన్నద్ధత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

ఈ శిక్షణలో 30 రోజుల పాటు తరగతి గదిలో బోధన, ఆచరణాత్మక అభ్యాసం ఉంటాయని తెలిపారు. అనంతరం ఏడు రోజుల పాటు పని ప్రదేశంలో ప్రత్యక్ష శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహకారం అందించనున్నట్లు వివరించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలోని టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం, ఎక్సెల్ఆర్ సంస్థ సహకారంతో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలకు అనుసంధానంగా మరో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.






ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 45 రోజుల పాటు తరగతి గదిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. సంబంధిత రంగాల ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు నేర్పించి, ఉపాధి అవకాశాలు పొందేందుకు తోడ్పాటు అందించనున్నట్లు వివరించారు.

ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ములుగులోని బండారుపల్లి రోడ్డులో ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించి, తాము చేరదలచిన శిక్షణ కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

రెండు కార్యక్రమాలకు పేర్ల నమోదుకు చివరి తేదీ 31.10.2026 అని స్పష్టం చేశారు.

శిక్షణ తరగతుల ప్రారంభ తేదీలు, ప్రవేశ ప్రక్రియ, ఇతర పూర్తి వివరాల కోసం టాస్క్ సెంటర్ కోఆర్డినేటర్ మురళి కృష్ణ 9490500282, 9618449360 నంబర్లలను సంప్రదించాలని తెలిపారు.

సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు ఈ శిక్షణ కార్యక్రమాల వివరాలను అర్హులైన యువతకు తెలియజేసి, గడువులోగా పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం..వొడితల ప్రణవ్..





- ప్రజా ప్రభుత్వంలో ప్రతి లబ్ధిదారున్ని ఆదుకుంటాం..
- జమ్మికుంట మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేసిన ప్రణవ్..

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 15 :

కష్ట సమయంలో పేదవారికి అండగా నిలిచి వారికి మేమున్నామనే భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున మన ఊరు-మన కాంగ్రెస్-మన ప్రణవ్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండల పరిధిలోని మాచనపల్లి,జగ్గయ్యపల్లి,కోరపల్లి,విలాసాగర్,నగురం,వావిలాల,నాగంపేట,శాయంపేట,మడిపల్లి గ్రామాల్లో 8 లక్షల విలువ చేసే 17 చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు.పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా ఆదుకుంటున్నామని,గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు వివిధ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరించడానికి కృషిచేస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా కష్ట సమయంలో అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి,ఇంచార్జి ప్రణవ్ బాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,మండల అధ్యక్షుడు,పట్టణ అధ్యక్షుడు,ప్రజా ప్రతినిధులు,బ్లాక్ కాంగ్రెస్,సీనియర్ నాయకులు,బీసీ,ఎస్సీ,మైనారిటీ,యూత్,యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలి..**

నియోజకవర్గంలోని ప్రజలందరిపై దుర్గామాత అమ్మవారి కృప ఉండాలని,అమ్మవారి దయవల్ల నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.జమ్మికుంట మండల పరిధిలోని గ్రామాల్లో దుర్గామాత మండపాలను దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



- క్రీడాకారులకు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపు

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

రాష్ట్రస్థాయి పాఠశాలల టెన్నిస్ పోటీలకు ఘనంగా శ్రీకారం టెన్నిస్ కోర్టులో ఎమ్మెల్యే రాకెట్లు పట్టి ఆడటంతో క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం వేదికగా 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య లాన్ టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు టెన్నిస్ ఆడి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

అక్టోబర్ 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలు పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలిఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విద్యార్థుల్లో






దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి పోటీలు కీలక వేదికలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటూ క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. క్రీడల్లో రాణించేందుకు ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ అవసరమని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పించడం ద్వారా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తయారు చేయవచ్చని పేర్కొన్నారు.

క్రీడలు జీవితానికి పునాది: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. హనుమకొండలో టెన్నిస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు అవసరం: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను అలవర్చుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనడమే కాకుండా తమ ప్రతిభను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, అండర్ 19, అండర్ 17 పాఠశాలల క్రీడా కార్యదర్శులు శ్రీధర్, వాసుదేవరావు, హనుమకొండ డిస్ట్రిక్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎర్రగట్టు స్వామి, కోశాధికారి సిరికొండ సంజీవరావు, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బరుపాటి గోపి, పి. వెంకట్ క్రీడా నిర్వాహకులు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నేడు బతుకమ్మ సంబరాలు

- ఘనంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 16:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) సాయంత్రం 5.30 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నారు.

ఈ వేడుకలకు హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నగర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంప్రదాయ ఆటపాటలతో సంబరాలను విజయవంతం చేయాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఐక్యత, సాంస్కృతిక వైభవాన్ని చాటే ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పండుగ శోభను మరింత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

## 'సర్' తుది జాబితాలో చోటుకు మరో అవకాశం

- 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:



**మహబూబాబాద్, అక్టోబర్.15 :** ఈ ఏడాది నవంబరు 9న ప్రకటించనున్న 'సర్' ఓటరు తుది జాబితాలో తమ పేరు చేర్చుకోవడానికి పౌరులకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చిందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ నేడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.



ఇందులో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15, 16వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోందని ఇందులో కొత్త ఓటరుగానూ నమోదు చేసుకోవచ్చని ముసాయిదా జాబితా ప్రచురణలో భాగంగా ఏఎస్డీడీ(ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) పేరుతో తొలగించిన 73 లక్షల ఓటర్లకు సైతం మరో అవకాశం కల్పించిందని అన్నారు.

ఎక్కడైనా పొరపాటున ఈ జాబితాలో చేరిన ఓటర్లు కూడా ఈ శిబిరాలలో ఫారం-6ను సమర్పించవచ్చునని అన్నారు.

ఈ రెండు రోజుల్లో ఫారం-6 సమర్పించిన వారి పేర్లను నవంబరు 9న ప్రచురించే తుది జాబితాలో చేర్చడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. వాస్తవానికి 'సర్'లో భాగంగా ఫిర్యాదులు, అభ్యంతరాల సమయంలో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి గత ఆగస్టు 17 నుంచి ఈ నెల 7వ తేదీ వరకే వెసులుబాటు కల్పించారు. ఈ గడువు ముగియడంతో 'సర్' తుది జాబితాలో అవకాశం లేకుండా పోయిందని, అయితే ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో 15, 16వ తేదీల్లో ఫారం-6 ఇవ్వడానికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చినందున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈరోజు క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ రెవిన్యూ కె. అనిల్ కుమార్, మహబూబాబాద్ ఆర్డీఓ రాజేశ్వరి, అన్ని మండలాల తహసిల్దార్లు, తదితరులు క్షేత్రస్థాయిలో ఎస్ ఐ ఆర్ సవరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుపై వేగం పెంచాలి: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి

మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 15:** వరంగల్ నగరంలో ప్రతిపాదిత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (ఖ+ణ) ప్రాజెక్టు పురోగతిపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి గురువారం హైదరాబాద్ నుంచి కేఎఫ్‌డబ్ల్యూ (ఖటఔ) సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తన క్యాంపు కార్యాలయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, టెండర్ ప్రక్రియ, తదితర కీలక అంశాలపై చర్చించి, పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలను సమీక్షించారు.

ఈ సందర్భంగా డాక్టర్ టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ, వరంగల్ నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి ప్రజారోగ్య పరిరక్షణకు, పారిశుధ్య మెరుగుదలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అంశాలను సమన్వయంతో పరిష్కరిస్తూ, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, వరంగల్ నగరంలో సమగ్ర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు ద్వారా మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడంతోపాటు, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు కల్పించేందుకు ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. సంబంధిత శాఖలు, కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి చర్యలను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పబ్లిక్ హెల్త్ శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ సాయప్ప రెడ్డి , పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ రంజిత్, బల్దియా ఈఈ మహేందర్, డిఈ కార్తీక్ రెడ్డి, కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా--మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



**పరకాల ప్రతినిధి మన మీ వార్త అక్టోబర్ 16 :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొత్తపల్లి గోరి మండల పరిధిలోని కొత్తపల్లి. గోరి గ్రామంలో ఉన్న నవదుర్గ మాత ఆలయంలో గురువారం శ్రీ దుర్గా--మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ పవిత్ర వేడుకతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో పులకించిపోయింది.

శ్రీశ్రీశ్రీ నిత్యానందగిరి స్వామీజీ, మాతా మైత్రేయి, శ్రీశ్రీశ్రీ మహాదేవి మాతాజీ ఆశీస్సులతో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

శ్రీ దుర్గా--మల్లేశ్వర స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణ ఘట్టాన్ని దర్శించుకుని భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.

ఈ సందర్భంగా మహాదేవి మాతాజీ మాట్లాడుతూ..

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామాల్లో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు హిందూ సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని శ్రీశ్రీశ్రీ మహాదేవి మాతాజీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నవదుర్గ మాత ఆలయ కమిటీ సభ్యులు, భక్తకమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై రేగొండ పోలీసుల చర్యలు చేపట్టారు.

- ఈ సందర్భంగా ఎస్సై డి సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో చదువుకునే పిల్లలు
- గంజాయికి అలవాటు పడుతున్నారన్నారు .గ్రామాలలో ఎక్కడ గంజాయి సేవించిన విక్రయించిన పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

**పరకాల ప్రతినిధి మన మీ వార్త అక్టోబర్. 16, 10, 2026 :**

రేగొండ పోలీసులు సమాచారం ఇస్తే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారు.రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన కేసులో తిప్పారపు సందీప్ అలియాస్ వంశీ (23), స్వగ్రామం లింగాల, రేగొండ మండలం, ప్రస్తుతం పరకాల పట్టణంలో నివాసం ఉంటున్న వ్యక్తిని రేగొండ పోలీసులు, సీసీఎస్ భూపాలపల్లి పోలీసుల సంయుక్త బృందం అదుపులోకి తీసుకుంది.



విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, సదరు వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా, కలిమెల తహసీల్ పరిధిలోని నాగులూరు గ్రామానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి, తెలంగాణ ప్రాంతానికి తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో పాల్గొన్న ఇతర వ్యక్తులు గతంలో పోలీసులకు పట్టుబడిన విషయం తెలుసుకొని, తాను కూడా పోలీసులకు పట్టుబడతాననే భయంతో తప్పించుకొని తిరుగుతున్నట్లు విచారణలో తెలిపాడు.

ఈ క్రమంలో తన స్వగ్రామమైన లింగాలకు వెళ్లేందుకు రేగొండకు చేరుకున్న సమయంలో రేగొండ పోలీసులు, సీసీఎస్ భూపాలపల్లి పోలీసుల సంయుక్త బృందం అతడిని అదుపులోకి తీసుకొని, తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా రిమాండ్‌కు తరలించింది.

ఈ కేసులో ప్రమేయం ఉన్న మిగిలిన నిందితులను త్వరితగతిన గుర్తించి, అదుపులోకి తీసుకొని కోర్టు ముందు హాజరుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రేగొండ ఎస్సై డి. సుధాకర్ ఈ సందర్భంగా తెలిపారు.

యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. గంజాయి కొనుగోలు, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేయాలని అన్నారు.

## బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఈర్ల రాజు ముదిరాజ్ నియామకం

**పటాన్‌చెరు, అక్టోబర్ 15:**



బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఈర్ల రాజు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనకు పార్టీ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, సహదేవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. బీరంగూడ డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో డివిజన్ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని వెల్లడించారు.తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీరంగూడ డివిజన్, అమీన్‌పూర్ మండల ప్రజలకు, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో సహకరిస్తున్న పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇకపై వార్తా కథనాల్లో తనను బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా గుర్తించాలని కోరారు.

# జనగామ మహిళా శక్తికి నిదర్శనం

# నాలుగు నెలల్లో రూ.40 లక్షల టర్నోవర్!

- ఉద్యోగం రాలేదని కుంగిపోకుండా.. స్వయం ఉపాధితో విజయపథంలో రాధిక
- మహిళా శక్తి రైతు సేవా కేంద్రం ద్వారా ఆర్థిక స్వావలంబన
- మహిళలకు అండగా నిలుస్తున్న అధికారుల ప్రోత్సాహం.. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ

**మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**






జీవితంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను అధిగమించి, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయాన్ని సాధించవచ్చని జనగామ జిల్లా, ఘనపూర్ (స్టేషన్) మండలం, ఇప్పగూడెం గ్రామానికి చెందిన రాధిక నిరూపిస్తున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలు, మరోవైపు ఉద్యోగ ప్రయత్నాల్లో ఎదురైన నిరాశలను అధిగమించి, మహిళా శక్తి రైతు సేవా కేంద్రం నిర్వహణ ద్వారా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ.40 లక్షల టర్నోవర్ సాధించడం ఆమె కృషికి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

రాధిక గతంలో ఎన్నో ఉద్యోగాల కోసం ప్రయత్నించారు. 2018లో స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించినప్పటికీ, తన చిన్న కుమారుడి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా తన ప్రయత్నాలను కొనసాగించారు. 2024లో డీఎస్సీ పరీక్ష రాసి స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) ఉద్యోగానికి ప్రయత్నించగా, కేవలం 0.5 మార్కు తేడాతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన ఆమె, ఇక జీవితంలో తాను ఏమీ సాధించలేనేమోనని బాధపడ్డారు. అయితే, ఆ నిరాశే తన జీవితానికి ముగింపు కాదని, కొత్త అవకాశాల ద్వారా ముందుకు సాగవచ్చని నిరూపిస్తూ స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు.

మహిళా సంఘంతో అనుబంధం.. స్వయం ఉపాధితో కొత్త ప్రయాణం!

గత పదేళ్లుగా మహిళా సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్న రాధిక, మహిళా సంఘాల ద్వారా తన కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చారు. అధికారుల ప్రోత్సాహం, మహిళా సంఘాల సహకారంతో మహిళా శక్తి రైతు సేవా కేంద్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ కేంద్రం ద్వారా కేవలం నాలుగు నెలల్లోనే రూ.40 లక్షల టర్నోవర్ సాధించడం ఆమె వ్యాపార నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం. మహిళలు సరైన అవకాశాలను అందిపుచ్చుకుని, పట్టుదలతో కృషి చేస్తే వ్యాపార రంగంలోనూ అద్భుత విజయాలు సాధించగలరని రాధిక ప్రయాణం చాటిచెబుతోంది.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవతో తనకు ఈ అవకాశం లభించిందని రాధిక తెలిపారు. తనను ప్రోత్సహించి, ముందుకు నడిపించిన అధికారులకు, ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళా శక్తి రైతు సేవా కేంద్రంతో నాలుగు నెలల్లో రూ.20 లక్షల టర్నోవర్! అధికారుల ప్రోత్సాహంతో స్వయం ఉపాధి దిశగా ప్రియాంక అడుగులు కుటుంబ పోషణకు అండగా మహిళా శక్తి రైతు సేవా కేంద్రం

జనగామ జిల్లా, కొడకండ్ల మండలం, రామవరం గ్రామానికి చెందిన ప్రియాంక మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తూ, ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేస్తున్నారు. కేంద్రాన్ని ప్రారంభించిన కేవలం నాలుగు నెలల్లోనే రూ.20 లక్షల టర్నోవర్ సాధించడం విశేషం.

రామవరం గ్రామంలో మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్న ప్రియాంక, అధికారుల ప్రోత్సాహంతో తన వ్యాపార కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రూ.20 లక్షల టర్నోవర్ సాధించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

కుటుంబ పోషణకు ఆర్థిక భరోసా మహిళా శక్తి రైతు సేవా కేంద్రం ద్వారా లభిస్తున్న అవకాశాలు తన కుటుంబ పోషణకు ఎంతగానో తోడ్పడుతున్నాయని ప్రియాంక పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందుతూ కుటుంబానికి అండగా నిలవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని తెలిపారు.

మహిళా శక్తి రైతు సేవా కేంద్రం నిర్వహణకు ప్రోత్సాహం అందించిన అధికారులకు, ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్‌కు ప్రియాంక ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తూ, స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలు గ్రామీణ మహిళల అభ్యున్నతికి దోహదపడుతున్నాయి.

ఇతర మహిళలకు స్ఫూర్తి అవకాశం లభిస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరనే విషయాన్ని రాధిక, ప్రియాంక విజయగాథ చాటి చెబుతోంది. ఉద్యోగం ఒక్కటే ఉపాధికి మార్గం కాదని, పట్టుదలతో స్వయం ఉపాధిని ఎంచుకుంటే ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవవచ్చని వారి ప్రయాణం నిరూపిస్తోంది.

మహిళా సాధికారతకు బాటలు వేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులు కేవలం పొదుపు కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములై వ్యాపారవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలు మహిళలకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల ద్వారా మహిళలు వ్యవసాయ రంగంలో సేవలందించడంతో పాటు, స్వయం ఉపాధిని అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తోంది.

# కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమల తనిఖీ

- వరంగల్‌లో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: సభ్యసాచి ఘోష్

**మన మీ వార్త అక్టోబర్ 15 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**





వరంగల్ జిల్లాలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమల పురోగతికి అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్, ఐఏఎస్ అధికారులకు సూచించారు.

గురువారం ఆయన వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కిటెక్స్ (ఖఛవఙ), యంగ్‌వన్ (శీబఅస్త్రశీఅవ), గణేశా (+ుఅవంష్ణు) కంపెనీలను స్వయంగా తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తి కార్యకలాపాలు, పనితీరును పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో ముచ్చటించారు.

అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వరంగల్ ప్రాంతంలో వస్త్ర పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పించాలని, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని అధికారులను ఆదేశించారు.

వస్త్ర పరిశ్రమ రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానికంగా పరిశ్రమల విస్తరణకు, ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి, పరిశ్రమలకు అవసరమైన సహకారాన్ని సకాలంలో అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, చేనేత మరియు వస్త్ర శాఖ అదనపు సంచాలకులు ఎన్. వెంకటేశ్వరరావు, ఏడీ శ్రీకాంత్ రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, నారాయణ రెడ్డి, టీటీడీఓ, సంగెం తహసీల్దార్ జి. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతం





**హనుమకొండ అక్టోబర్ 15 (మీ వార్త ప్రతినిధి ) :**

భారత క్షిపణి పితామహుడు , మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి ని పురస్కరించుకొని గురువారం అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు దేవునూరి ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం మందిరంలో పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన వివిధ రంగాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు ఉపాధ్యాయులకు, సామాజిక సేవకులకు (22 మంది) కి కలాం ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2026, ఆపద కాల సమయంలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన (23 మంది) కి ఎ.పి.జె. అబ్దుల్ కలాం లైఫ్ సేవర్ అవార్డు - 2026 అవార్డులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హనుమకొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డీటీఓ ఆకవరం శ్రీనివాస్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణ గౌడ్ లతో కలిసి అబ్దుల్ కలాం గారికి పూలమాలలు వేయడం జరిగింది. అనంతరం తలసేమియా చిన్నారుల కోసం యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ మరియు ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో “ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా 33 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. హనుమకొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డీటీఓ ఆకవరం శ్రీనివాస్ కుమార్ హాజరై మాట్లాడుతూ మామూలు పేద కుటుంబంలో జన్మించి పేపర్ బాయ్ గా పనిచేసి రాష్ట్రపతిగా ఎన్నికై దేశ అభివృద్ధికి ఎనలేని సేవలందించారని మనమందరం వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని వారి బాటలో నడవాలని సూచించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు. ఈ కార్యక్రమంలో కలాం ఫౌండేషన్ ఫౌండర్ ఆనంద్ దేవూనూరి, కలాం ఫౌండేషన్ కో వ్యవస్థాపకుడు జిమ్మల వీరారెడ్డి, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు(స్విమ్మర్ రాజు), గంగోజుల నరేష్ జనగామ జిల్లా బాధ్యులు మీసాల సుధాకర్ ములుగు జిల్లా బాధ్యులు ఇజ్జగిరి ఆగయ్య కనకరాజు వెంకటరమణ సుధీర్ అయిత శ్రీనివాస్ మిమిక్రీ అంజన్ కుమార్ వేణుగోపాల్ పిన్నింటి బాలాజీ, రాజ్ కుమార్ , బొట్టు కమలాకర్, గజ్జెల సుమన్, ఊరటి రవికుమార్, పల్లె రాజి రెడ్డి, మునిగాల రాంప్రసాద్,ఉప్పరపల్లి రాజ్ కుమార్ , ముస్తఫా రక్తదాతలు పాల్గొన్నారు.

# కోకపేట పెరిక ఆత్మగౌరవ భవనానికి నిధులు అందిస్తా

- బీసీ కులాలకు పెరిక కులం ఆదర్శం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- రాష్ట్ర సంఘం అధ్యక్షులు గటిక విజయ్ కుమార్ నాయకత్వంలో
- ఎంపీ ఈటల రాజేందర్ కలిసిన రాష్ట్ర సంఘం నాయకులు

**అక్టోబర్ 16,10, 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**

కోకాపేట పెరిక కుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో పెరిక కుల సంఘం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతర బీసీ కులాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆయన అభినందించారు.
తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం (రిజి. నం. 766/2014) అధ్యక్షుడు డాక్టర్ గటిక విజయ్ కుమార్ నాయకత్వంలోని ప్రతినిధి బృందం 2026 అక్టోబర్ 14న శామీర్‌పేటలో ఈటల రాజేందర్‌ను కలిసింది. ఈ సందర్భంగా కోకాపేటలో నిర్మిస్తున్న పెరిక కుల ఆత్మగౌరవ భవనం, ఎల్‌బీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న బాలికల వసతి గృహం పురోగతిని నాయకులు ఆయనకు వివరించారు.

కోకాపేటలో తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనానికి ఇప్పటివరకు ఏడు స్లాబులు పూర్తయ్యాయని, కుల బంధువులు, దాతల సహకారంతోనే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భవన నిర్మాణానికి ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి సహకారం అందించాలని కోరారు. దీనిపై ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించి, నిధులు సమకూర్చేందుకు హామీ ఇచ్చారు.



ఎల్‌బీ నగర్‌లో నిర్మిస్తున్న బాలికల వసతి గృహాన్ని 2027--28 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు నాయకులు వివరించారు. బాలికల విద్య, భవిష్యత్తుకు తోడ్పడేలా ప్రత్యేక వసతి గృహాన్ని నిర్మించడం అభినందనీయమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం గౌరవ అధ్యక్షుడు మద్దా లింగయ్య, మాజీ అధ్యక్షుడు దాసరి మల్లేశం, పెరిక విద్యార్థి వసతి గృహం అధ్యక్షుడు డాక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ సుందరి వీరభాస్కర్, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సుంకరి ఆనంద్, ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, పెరిక విద్యార్థి వసతి గృహం ప్రధాన కార్యదర్శి అచ్చా రఘు కుమార్, ఎల్‌బీ నగర్ గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి నర్సింహరావు, యువజన విభాగం గౌరవ అధ్యక్షుడు మైలారుశెట్టి చైతన్య, అడ్వకేట్స్ విభాగం కోఆర్డినేటర్ జూకూరి మహేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎర్రంశెట్టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై విస్తృత స్థాయి సమావేశం





- పాల్గొన్న హబ్సీగూడ కో-ఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్, డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి

**హబ్సిగూడ, అక్టోబర్ 15 ( మన మీ వార్త ):**

మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.
హబ్సీగూడలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కో-ఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్ గారు పాల్గొని గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై బీఎల్‌ఏ లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క బీఎల్‌ఏ తమ బూత్ పరిధిలోని పట్టభద్రులను విధిగా ఓటు నమోదు చేయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఉప్పల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చింతల బాబురావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గన్నారం విజయ్ కుమార్, మురళీ కృష్ణ ముదిరాజ్, నర్సింగ్ రావు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చింతల లక్ష్మీ నారాయణ, గంగా యాదవ్, రాజు నాయక్, రమేష్ నాయక్, ధర్మరాజు, గుండు రాజన్న, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసు నాయక్, సాయి కుమార్, సుమన్ నాయక్, మహమూద్, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..







- తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు పుట్టినిల్లు..
- బతుకునిచ్చే బతుకమ్మ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి.
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా నాయకురాళ్ళతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న హుజురాబాద్ ఇంచార్జి ప్రణవ్..

**మన మీ వార్త హుజురాబాద్ ప్రతినిధి అక్టోబర్ 15 :**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు పుట్టినిల్లు అని,బతుకమ్మ పండుగ అంటే ప్రతి ఆడబిడ్డ సంతోషంగా గడిపి,పూలను ప్రకృతిగా భావించి పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ కార్యాలయాన్ని సర్వాంగ,సుందరంగా ముస్తాబు చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఇంటికి దీపం మహిళలే కాబట్టి వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని,రానున్న రోజుల్లో వారి సంక్షేమానికి మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని అన్నారు.నియోజవర్గవ్యాప్తంగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహిళా శ్రేణులతో కార్యాలయం కిటకిటలాడింది.అనంతరం మహిళలతో కలిసి ఆడి,పాడారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాల్లు,జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు,ప్రజా ప్రతినిధులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటిపారుదల చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- పాఖాల అభివృద్ధికి రూ.150 కోట్లు - చిన్న చెరువుల అభివృద్ధికి రూ.100 కోట్లు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద - ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట, అక్టోబర్ 15 (మల్లేష్ మీ వార్త ప్రతినిధి ) :**





నర్సంపేట నియోజకవర్గ పరిధిలో పాఖాల సరస్సు సాగునీటి పనుల అభివృద్ధితో పాటు చిన్న నీటిపారుదల చెరువుల అభివృద్ధికి అవసరమైన పనుల ప్రతిపాదనలను సమగ్రంగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబధిత అధికారులకు సూచించారు.గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఖాల అభివృద్ధికి రూ.150 కోట్లు, 47 చిన్న నీటిపారుదల చెరువుల అభివృద్ధికి రూ.100 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి కమిటీ రూపొందించిన ప్రతిపాదనలను పరిశీలించి నివేదికలు సమర్పించాలని సంబధిత అధికారులను ఆదేశించారు. నీటి వనరుల అభివృద్ధి, వర్షపు నీటి సంరక్షణ, సాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకెఎస్ వై ) పథకం కింద చేపట్టాల్సిన పనులపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ప్రతిపాదనలను సమగ్రంగా రూపొందించాలని తెలిపారు. పనుల అమలుకు అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని, నర్సంపేట నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కృపాకర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శన్, సీజీడబ్ల్యూడీ అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ తారిఖ్, నర్సంపేట ఆర్డీవో, డీఆర్‌డీఏ పీడీ, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనీ డెవలపర్స్ లో అక్రమ కట్టడాలకు బల్దియా నోటీసులు

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 15, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనీ డెవలపర్స్ లో పబ్లిక్ పార్క్ కోసం కేటాయించిన స్థలంలో చెపట్టిన నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. గంగాస్థాన్ ఫేస్ 2లోని శ్రీనీ డెవలపర్స్ లోని వెంచర్ లో కొందరు పార్క్ స్థలములో ఆక్రమంగా ఇండ్లు కట్టుకున్నారని స్థానిక నివాసులు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేశారు. దానితో గురువారం రూరల్ తహసీల్దార్, మున్సిపల్ ఎన్ ఫోర్స్ మెంట్, టౌన్ ప్లానింగ్ అధికారుల నోటీసులు జారీ చేసి ఇంటికి అతికించారు. శ్రీని వెంచర్ లో 2,000 గజాలు బల్దియాకు సంబంధించిన పది శాతం భూమి అని తెలిపారు. సంబంధిత స్థలంలో ఇండ్లు కట్టుకున్న వారికి మూడవసారి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో సంబంధిత స్థలం డాక్యుమెంట్లు సమర్పించాలి లేకపోతే కూల్చేస్తామని అధికారులు తెలిపారు. బల్ధియా పార్క్ కు కేటాయించిన స్థలంలో అక్రమ కట్టడాలు వెంటనే కూల్చివేయాలని స్థానిక కాలనీ వాసులు అధికారులను డిమాండ్ చేశారు.

## కనకదుర్గ అమ్మవారి పూజలో పాల్గొన్న బి ఆర్ఎస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ మోత్కూరి సందీప్



**మీ వార్త అక్టోబర్ 15 సూర్యపేట జిల్లా ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్థానిక 22వ వార్డు జువ్వి చెట్టు వీధిలో నిర్వహించిన కనకదుర్గ అమ్మవారి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి ఆర్ ఎస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ మోత్కూరి సందీప్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.
అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## బీరంగూడ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి దర్శనం.

**పటాన్‌చెరు, అక్టోబర్ 15: మీ వార్త ప్రతినిధి:**



అమీన్పూర్ మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ మంజుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, ఆలయ ప్రధాన అర్చకులు సాయికుమార్ పర్యవేక్షణలో బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణను ఘనంగా నిర్వహించారు.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణతో ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. ప్రత్యేకంగా నిర్వహించిన లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారి భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మంజుల చంద్రశేఖర్ ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## దుర్గాదేవి ఆలయంలో కొనసాగుతున్న అన్నదానం





**(మన మీ వార్త న్యూస్ ) : అక్టోబర్ 15, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

నిజామాబాద్ నగరంలోని గుమస్తా కాలనీలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న తొమ్మిది రోజుల అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఆమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ అమ్మవారిని తొమ్మిది రూపాలలో కొలుస్తున్నామని తెలిపారు. ప్రజలు తండోతండాలుగా వస్తుండడంతో వారికి అమ్మవారి ఆశీస్సులతో తొమ్మిది రోజుల పాటు నిత్యన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఐదు రోజులు విజయవంతంగా పూర్తయ్యాయని, మిగిలిన నాలుగు రోజుల కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, దాతలు సహకరించాలని కోరారు. ఈ పవిత్ర సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం




**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ విడిపోయి 12 ఏళ్లు దాటింది. అయిన రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు మాత్రం ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి. ఇవి నిత్యం రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. తాజాగా రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. అయితే, చంద్రబాబు ప్రతిపాదనపై తెలంగాణలో అనేక సందేహాలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధంగా రావాల్సిన వాటిని పక్కనపెట్టి, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలనే చంద్రబాబు ప్రతిపాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇటీవల జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారు. పెండింగ్లో ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి ఉమ్మడి రాష్ట్ర నాయకత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. అయితే, దీనిని తెలంగాణ ప్రభుత్వం కేవలం కాలయాపన కార్యక్రమంగా చూస్తోంది. అంతేకాక, ఏపీకి అనుకూలంగా చట్టాన్ని మార్చే ప్రయత్నంగా అనుమానిస్తోంది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని, లొకేషన్ ఆధారంగా ఆస్తుల విభజన జరగాలని తెలంగాణ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఈ విభేదాల వెనుక బలమైన రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయి. షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనలో, అలాగే చట్టంలో ప్రత్యేకంగా పేర్కొనని సంస్థల విషయంలో గతంలోనే తమకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు వచ్చాయని తెలంగాణ వాదిస్తోంది. ఇప్పుడు 'గివ్ అండ్ టేక్' పేరుతో వాటిని తప్పిస్తారని తెలంగాణ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు.. ఎక్స్టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులకు సంబంధించి పబ్లిక్ డెట్ విభజనలో జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలని విభజన చట్టం స్పష్టం చేసింది. అయితే.. ఏపీ మాత్రం లొకేషన్, యుటిలైజేషన్, జనాభా ప్రాతిపదికన వేర్వేరు పద్ధతులను ప్రతిపాదించిందని తెలంగాణ ఆరోపిస్తోంది. ఈ వివాదం కేవలం అధికారుల స్థాయికే పరిమితం కాకుండా రాజకీయ వేడిని రాజేసింది. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరించి, తెలంగాణ నుంచి రావాల్సిన మొత్తాన్ని రికవర్ చేయాలని ఆదేశించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్కు లేఖ రాయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చట్ట నిబంధనలను దాటి 'గివ్ అండ్ టేక్' ముసుగులో ఏపీ ఆర్థికంగా లబ్ది పొందాలని చూస్తోందని తెలంగాణ గట్టిగా వాదిస్తోంది. మొత్తంగా చూస్తే.. రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ఈ విభజన అంశాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. చట్టం ప్రకారం హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ భావిస్తోంది. అదే సమయంలో పరస్పర అంగీకార మార్గాలను అన్వేషించాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. మరి ఈ ప్రతిష్టంభన రాబోయే రోజుల్లో ఏ రాజకీయ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

## హైదరాబాద్ మెట్రో అనాథ !



**హైదరాబాద్ :** దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వ్యాపార హబ్గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మెట్రో రైలు నెట్వర్క్ విస్తరణ విషయంలో మాత్రం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే వెనుకబడిపోతోంది. ఢిల్లీ 390 కిలోమీటర్లకు పైగా ట్రాక్తో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేల కోట్ల కేంద్ర నిధులతో తమ రెండో, మూడో దశ పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నాయి. కానీ భాగ్యనగరంలో మొదటి దశ 69 కిలోమీటర్ల మేర పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, రెండో దశ విస్తరణ మాత్రం ఫైళ్ల దశను దాటి పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 38 వేల కోట్లకు పైగా అంచనాతో 122 కిలోమీటర్ల పైబడిన ఫేజ్-2 డీపీఆర్లను కేంద్రానికి సమర్పిస్తున్నప్పటికీ.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి రావాల్సిన కీలక ఆమోదాలు, నిధుల భాగస్వామ్యంపై ఏకాభిప్రాయం రావడం లేదు. ఉత్తరాది నగరాల ప్రాజెక్టులకు, మహారాష్ట్ర, గుజరాత్ మెట్రో నెట్వర్క్లకు కేంద్ర బడ్జెట్లలో వేల కోట్ల రూపాయలను కేటాయిస్తున్న మోదీ సర్కార్.. దేశానికే భారీగా పన్నులు చెల్లిస్తున్న హైదరాబాద్ మెట్రో విషయానికి వచ్చేసరికి మాత్రం కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్కు గనక సమగ్రమైన ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు అందితే.. అది ముంబై, బెంగళూరులను సైతం వెనక్కి నెట్టి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరిస్తుందన్న వాస్తవం కేంద్ర పెద్దలకు తెలియంది కాదు. తక్కువ జీవన వ్యయం, మెరుగైన శాంతిభద్రతలు, ఐటీ-ఫార్మా రంగాల్లో అపార అవకాశాలు ఉన్న హైదరాబాద్లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా మెట్రో పూర్తయితే అంతర్జాతీయ పెట్టుబడులన్నీ ఇక్కడికే పోటెత్తుతాయి. అందుకే, ఇతర రాష్ట్రాల నగరాల పోటీతత్వాన్ని కాపాడేందుకు హైదరాబాద్పై ఆర్థిక, మౌలిక వసతులపరమైన ఆంక్షలు పరోక్షంగా అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకత్వ బలహీనతలు, కేంద్ర వివక్ష కారణంగా అంతిమంగా నష్టపోతున్నది సామాన్య హైదరాబాద్ పౌరుడే. ట్రాఫిక్ రద్దీతో నిత్యం నరకం చూస్తున్న ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు మెట్రో విస్తరణ కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కేంద్రం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం తక్షణమే సంపూర్ణ అనుమతులు మంజూరు చేసి, తన వాటా నిధులను విడుదల చేయాల్సిన చారిత్రక అవసరం ఉంది. లేకపోతే దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మహానగరానికి అన్యాయం చేసినట్లే అవుతుంది

## డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు సీఎం రేవంత్ నివాళులు

**హైదరాబాద్** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి హృదయపూర్వక నివాళులు అర్పించారు. దేశం గర్వించదగిన గొప్ప శాస్త్రవేత్త, అపారమైన మేధాశక్తికి ప్రతీక, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం, యువతకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. భారతదేశ రక్షణ, అంతరిక్ష పరిశోధన, శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన విశేష సేవలు చిరస్మరణీయమని అన్నారు. "కలలు కనండి.. ఆ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయండి" అనే కలాం సందేశం నేటికీ కోట్లాది మంది యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు.

# వనపర్తి రవాణా శాఖలో ఏం జరుగుతోంది?

- కుర్చీలో ఎంవీఐ, గ్రౌండ్లో కానిస్టేబుల్!
- ఫిట్నెస్ తనిఖీల నుంచి డీఎల్ పరీక్షల వరకు ప్రశ్నలే ప్రశ్నలు!
- డీఎల్, ఎల్ఎల్ఆర్ పరీక్షల నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి!

వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 మీ వార్త :

వనపర్తి జిల్లా రవాణా శాఖలో వాహనాల ఫిట్నెస్ తనిఖీలు, డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షల నిర్వహణ తీరు చర్చనీయాంశంగా మారింది. ఫిట్నెస్ గ్రౌండ్లో కానిస్టేబుల్ వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు, మరోవైపు డీఎల్ టెస్ట్ గ్రౌండ్లో ఎంవీఐ కుర్చీలో కూర్చొని పరీక్షలను పరిశీలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు తనిఖీలు ఎవరు చేస్తున్నారు? పరీక్షలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? నిబంధనల ప్రకారం ప్రక్రియ సాగుతోందా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

**ఫిట్నెస్ గ్రౌండ్లో కానిస్టేబుల్ తనిఖీలు!**

వాహనాల ఫిట్నెస్ తనిఖీలు రవాణా శాఖలో కీలకమైన ప్రక్రియ. వాహనాల పరిస్థితి, రహదారి భద్రతకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించాల్సి ఉంటుంది. అయితే, వనపర్తి ఫిట్నెస్ గ్రౌండ్లో కానిస్టేబుల్ వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో విధుల కేటాయింపుపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కానిస్టేబుల్కు ఏ బాధ్యతలు అప్పగించారు? తనిఖీలను సంబంధిత అధికారి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**కుర్చీలో ఎంవీఐ, డీఎల్ టెస్ట్ ఎలా?**





డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షల్లో అభ్యర్థుల డ్రైవింగ్ నైపుణ్యాన్ని, వాహన నియంత్రణ సామర్థ్యాన్ని నిబంధనల ప్రకారం అంచనా వేయడం ముఖ్యం. అయితే, డీఎల్ టెస్ట్ గ్రౌండ్లో ఎంవీఐ ప్రత్యక్షంగా పరీక్ష నిర్వహించకుండా కుర్చీలో కూర్చొని చూస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల డ్రైవింగ్ సామర్థ్యాన్ని ఏ ప్రాతిపదికన అంచనా వేస్తున్నారు? పరీక్షల్లో ఉత్తీర్ణతను ఎలా నిర్ణయిస్తున్నారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**డీఎల్, ఎల్ఎల్ఆర్ పరీక్షల్లో నిబంధనలు పాటిస్తున్నారా?**

డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్), లెర్నర్స్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) పరీక్షల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరం. అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలు నిర్ణీత విధానంలో జరుగుతున్నాయా? సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? పరీక్షల ప్రక్రియపై పర్యవేక్షణ ఎలా ఉంది? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**సివిల్ డ్రెస్లో విధులు, నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

సంబంధిత అధికారి సివిల్ డ్రెస్లో విధులు నిర్వహిస్తున్నారనే అంశం కూడా చర్చకు వస్తోంది. అయితే, సాధారణ దుస్తుల్లో విధులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమా? అన్నది సంబంధిత శాఖ నిబంధనలు, అధికారిక మార్గదర్శకాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. దుస్తుల అంశానికి మించి, విధుల నిర్వహణలో బాధ్యతలు, పర్యవేక్షణ, పరీక్షల పారదర్శకతపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారుల విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి!**

వనపర్తి రవాణా శాఖలో ఫిట్నెస్ తనిఖీలు, డీఎల్, ఎల్ఎల్ఆర్ పరీక్షల నిర్వహణపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఫిట్నెస్ గ్రౌండ్లో సిబ్బందికి కేటాయించిన విధులు, డీఎల్ పరీక్షల పర్యవేక్షణ, ఉత్తీర్ణత నిర్ణయించే విధానం తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రజల భద్రతతో ముడిపడిన రవాణా శాఖ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. ఈ అంశాలపై ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవాలను వెల్లడిస్తారా? అన్నది వేచి చూడాలి. వరుస కథనాలుగా మీ వార్త లో ...

# సక్సెషన్ కోసం రూ.5 లక్షల లంచం డిమాండ్..

- రూ.2.50 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముగ్గురు రెవెన్యూ అధికారులు
- కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడి - డిప్యూటీ తహసీల్దార్ తో సహా ముగ్గురికి బేడీలు

కీసర, అక్టోబర్ 15: (వార్త ప్రతినిధి) :

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో రెవెన్యూ అధికారుల అవినీతి బాగోతం మరోసారి బట్టబయలైంది. సాధారణ సక్సెషన్ కోసం వచ్చిన రైతు వద్ద ఏకంగా రూ.5 లక్షలు డిమాండ్ చేసి, రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ముగ్గురు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఈ ఘటన కీసర తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకోవడంతో స్థానికంగా కలకలం రేగింది.

**పట్టుబడిన అధికారులు:**

1. సందీప్ రెడ్డి - డిప్యూటీ తహసీల్దార్, కీసర
2. విజయ్ కుమార్ రెడ్డి - సీనియర్ అసిస్టెంట్
3. బాలకృష్ణ - రికార్డు అసిస్టెంట్

**అసలేం జరిగింది?**

కీసర మండలానికి చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య పన్నాల సుశీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.



ఆమె పేరు మీద కీసర పరిధిలో సర్వే నంబర్లు 183, 184 లో 3 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని తన పేరు మీదకు సక్సెషన్ (వారసత్వ బదిలీ) చేయించుకోవడానికి ఆమె కుమారుడు పన్నాల గిరిధర్ రెడ్డి కీసర తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు.

అయితే సదరు భూమి నిషేధిత జాబితా 22-A లో ఉందని, దానిని 22-A నుండి తొలగించి సక్సెషన్ చేయాలంటే చాలా ప్రాసెస్ ఉందని, తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయంలో కూడా డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి బాధితుడిని బెదిరింపు ధోరణిలో రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

**ఏసీబీ పక్కా ప్లాన్ తో దాడి..**

లంచం ఇవ్వలేని గిరిధర్ రెడ్డి వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పక్కా ప్లాన్ వేశారు.

ఏసీబీ సూచన మేరకు బాధితుడు మొదటి విడతగా రూ.2.50 లక్షలను తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డికి అందజేశాడు. విజయ్ కుమార్ ఆ డబ్బును రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణకు ఇవ్వగా, బాలకృష్ణ ఆ నగదును తీసుకెళ్లి డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి ఛాంబర్ లోని బ్యాగ్ లో పెడుతున్న సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి ముగ్గురినీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

**ప్రజల్లో ఆందోళన..**

ప్రభుత్వం రెవెన్యూ సేవలను ప్రజలకు సులభతరం చేస్తుంటే, కొందరు అధికారులు మాత్రం సక్సెషన్ వంటి సాధారణ పనులకు కూడా లక్షల్లో లంచం డిమాండ్ చేయడం పట్ల రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టుబడిన ముగ్గురిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

# బీరంగూడలో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

పటాన్ చేరు అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి :

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్..

బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, వందనపురి కాలనీలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు నిర్వహించిన వేడుకలకు అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలలో కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకుని, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు నందారం నరసింహ గౌడ్ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.
సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక శరన్నవరాత్రులు ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి





ప్రతీకగా జరుపుకునే దసరా శరన్నవరాత్రులు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని అన్నారు. లోకకల్యాణం కోసం దుష్టశిక్షణ, శిష్టరక్షణకు అవతరించిన జగన్మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

రాఘవేంద్ర కాలనీ, వందనపురి కాలనీల ప్రజలు ఐకమత్యంతో, భక్తిభావంతో నవరాత్రి ఉత్సవాలను ఇంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నవరాత్రుల్లో అమ్మవారిని ఆరాధించడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. భవానీ దేవి కటాక్షంతో డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.

కాలనీల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని నందారం నరసింహ గౌడ్ వెల్లడించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులుఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాఘవేంద్ర కాలనీ అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, కోశాధికారి గోపి, శంకర్ రెడ్డి, లక్ష్మారెడ్డితో పాటు కాలనీవాసులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

# వివాదంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి !

**హైదరాబాద్ :** జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి కుటుంబం , జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య వివాదం ముదిరింది. వీసీ భార్య సుజనా రెడ్డి తనపై చేసిన ఫిర్యాదులోని ఆరోపణలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత నెల 8వ తేదీన పోలీస్ స్టేషన్లో తనను తిట్టినట్లు, బెదిరించినట్లు సుజనా రెడ్డి చేసిన వాదనలు పూర్తిగా అవాస్తవమని, అసలు ఆమె ఎవరో కూడా తనకు తెలియదని, ఎప్పుడూ చూడలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థను వివాదాల్లోకి లాగుతూ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వివాదానికి అసలు మూలం వీసీ తీరుపై మహిళా ప్రొఫెసర్లు చేసిన ఫిర్యాదేనని పల్లా రాజేశ్వర్ రెడ్డి వెల్లడించారు. తాను జేఎన్టీయూ వీసీకి ఫోన్ చేసినప్పుడు ఆయన బాత్రూమ్లో ఉండటంతో వేరే వ్యక్తి ఫోన్ ఎత్తి మాట్లాడారని, తాను వీసీతోనే మాట్లాడతానని చెప్పి ఫోన్ పెట్టేసినట్లు తెలిపారు. ఆ తర్వాత వీసీతో మాట్లాడినప్పుడు? సీనియర్ ప్రొఫెసర్లను, ముఖ్యంగా మహిళా ప్రొఫెసర్లను తీవ్ర పదజాలంతో దూషించడానికి కారణమేమిటని తాను నిలదీసినట్లు చెప్పారు. తనపై ఏమైనా కోపం ఉంటే నేరుగా తనను ప్రశ్నించవచ్చు కానీ, మహిళా ఆచార్యుల పట్ల అలా వ్యవహరించడం తప్పు కదా అని అడిగినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సంభాషణ సమయంలో తన తప్పును అంగీకరించిన వీసీ కిషన్ కుమార్ రెడ్డి క్షమాపణ కోరారని, తిరుపతి నుంచి తిరిగి వచ్చిన తర్వాత దీనిపై లిఖితపూర్వకంగా లేఖ ఇస్తానని చెప్పారని పల్లా తెలిపారు. అయితే మరుసటి రోజు సాయంత్రం వరకు వీసీ నుంచి ఎలాంటి లేఖ రాకపోవడంతో, బాధితులైన మహిళా ప్రొఫెసర్లు స్వయంగా వెళ్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నుంచి దృష్టి మళ్లించేందుకే వీసీ తన భార్యను అడ్డుపెట్టుకుని తనపై వ్యతిరేక ఫిర్యాదు చేయించారని ఆయన ఆరోపించారు. మరోవైపు వీసీ కుటుంబం మాత్రం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తమను ఫోన్ ద్వారా బెదిరించారని, తప్పుడు కేసులు పెట్టిస్తానంటూ హెచ్చరించారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించింది. అయితే ఈ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేల్చడానికి పోలీసులు కేవలం ఒకరి మాటలకే పరిమితం కాకుండా, సంబంధిత సీసీటీవీ ఫుటేజీలు, కాల్ రికార్డులు, మహిళా ప్రొఫెసర్లతో వీసీ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. వర్సిటీ పరువును బజారుకీడ్చేలా సాగుతున్న ఈ పరిణామాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయ , విద్యావర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

# యాసంగిలో వరి పంట వేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితి ఏర్పడిందని, వచ్చే 8, 10 నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

### కేంద్రం సహాయం చేయాలి

ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని, కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలని కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు పొందే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్‌ను ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. విద్యుత్‌పై ఇచ్చే సబ్సీడీలను పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కొవిడ్ సమయంలో ప్రధాని మోదీ చెప్పినవి చేశామని, కష్టకాలంలో రాజకీయాలు చేయకుండా ఏం చెప్పినా చేశామని అన్నారు. ఇప్పుడు విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలని, దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలని తెలిపారు.

"సాగు చేయని రైతులకు ఆ నష్టాన్ని కేంద్రం పూడ్చాలి. తాగునీరు, విద్యుత్ సమస్య అధిగమించేందుకు అందరూ సహకరించాలి. నీరు లేక పశువులు, మూగజీవాలకు నష్టపోయే పరిస్థితి రావొద్దు. రాష్ట్రానికి కేంద్రం తోడ్పాటు ఇస్తేనే ఈ విపత్తును అధిగమించగలం. సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. సమస్యలు, సమాచారం ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఇస్తున్నాం. నోడల్ అధికారిగా రామకృష్ణారావును నియమిస్తున్నాం. దసరా తర్వాత భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం. కరవు పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మీడియాను కోరుతున్నా. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాకారులు, క్రీడాకారులు ముందుకు రావాలి"

### రిజర్వాయర్లు అన్నీ ఖాళీ అయ్యాయి

రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ ఉన్నాయిని, గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు 40 శాతం తక్కువ ఉన్నాయని వెల్లడించారు. చలికాలం రాకముందే రిజర్వాయర్లు



ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి 24వేల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉందని, నీటి కొరత వల్ల 12 లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌కు నీరు అందించే జలశయాల్లో కూడా నీరు లేదని వివరించారు.

### మార్చిలో ఉండే ఎండలు అక్టోబర్‌లోనే

యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని, సగటుపై అదనంగా 5వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగిందని, మార్చిలో ఉండాల్సిన ఎండలు అక్టోబర్‌లోనే ఉన్నాయని తెలిపారు. "కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వారు. పంచపాండవుల కాలువ నుంచి నేరుగా మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు వెళ్తోంది. పంచపాండవుల కాలువ నుంచి నేరుగా మోటార్ల ద్వారా కేసీఆర్ నీరు తోడుకుంటున్నారు. రాష్ట్రంలో ఎవరికీ లేని ప్రత్యేక వెసులుబాటు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే ఎందుకు?. ప్రత్యేక మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు ఎత్తిపోతలపై నిజనిర్ధరణకు మేం సిద్ధం. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో అక్రమాలు ఉన్నాయని మొదట్నుంచి ఇంజినీర్ రఘు చెప్పారు. యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూ.17,950 కోట్లతో ఒప్పందం చేశారు. యాదాద్రి థర్మల్ కేంద్రం అంచనాలు రూ.37,781 కోట్లకు పెరిగింది. యాదాద్రి థర్మల్ కేంద్రం అంచనాలు ఏకంగా 110 శాతం ఎందుకు పెరిగింది?. ఒక్కో మెగావాట్‌కు రూ.8 వేల కోట్లు అదనపు అంచనాలు పెరిగాయి"

### అఖిలపక్షాలతో రేపు సమావేశం

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఎల్‌నినోపై సీఎం సలహాదారు రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితులపై రేపు అఖిలపక్షాలతో తెలంగాణ ప్రభుత్వం చర్చించనుంది.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిలో జరుగుతున్న అంతరాయంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దామరచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ (చీఫ్ ఇంజినీర్) సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విద్యుత్ ఉత్పత్తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చర్యలు తీసుకున్నారు. మరోవైపు పర్యవేక్షణ కోసం ఐఏఎస్ అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా ప్రభుత్వం నియమించింది.

మరోవైపు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించేందుకు థర్మల్ కేంద్రానికి ప్రభుత్వం ఏఐఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. హరికిషన్, వెంకటేశ్ దొత్రే, రాహుల్‌రాజ్, హనుమంత్ కొండిబ, శివకుమార్ నాయుడుని స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించనున్నారు. విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐఏఎస్‌లనూ సస్పెండ్ చేస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

బుధవారం జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు సరఫరా సాఫీగా జరిగే విధంగా చూడాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితిలో మాత్రం ఎందుకు మార్పు రావడం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో విద్యుత్తు కొరత ఏర్పడే ప్రమాదం



ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది తానేనన్నారు. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితి మారలేదని మండిపడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోనని అధికారులను హెచ్చరించారు. వైఫల్యాలపై విద్యుత్తు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీ సంబంధిత విభాగానికి సంబంధించిన అధికారులను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్తు అంతరాయాలకు రోజుకో కారణం చెప్పొద్దన్నారు.

# సింగరేణిలో వేడెక్కుతున్న రాజకీయం..!

**హైదరాబాద్ :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు నగారా మోగనుంది. అయితే ఈ లోపే సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రాజకీయ పార్టీలను అప్రమత్తం చేశాయి. వేలాది మంది కార్మికుల కుటుంబాలు సింగరేణి ఆధారంగా పనిచేస్తున్నారు. ఇలాంటి ఎన్నికల్లో గెలవడం ద్వారా సత్తా చాటాలని రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి.సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కోల్‌బెల్ట్ ప్రాంతం దాదాపు 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడి కార్మికులు, వారి కుటుంబాల ప్రభావం ఎన్నికల ఫలితాలపై గట్టిగా ఉంటుంది. అందుకే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గతం నుంచి కూడా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన పార్టీనే ఆయా ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధిస్తుందనే బలమైన నమ్మకం రాజకీయ వర్గాల్లో ఉంది.గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే యూనియన్ ఎన్నికలు జరుగాయి. అయితే ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారాయి. నవంబర్ లేదా డిసెంబర్ నాటికి ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే న్యాయస్థానంలో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ వైఖరి, కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అందుకే కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశాయి.ఎన్నికలు రాబోతున్నాయన్న సంకేతాలు రావడంతో అధికార, ప్రతిపక్ష



కాపాడుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే అనుబంధ సంఘం అయిన టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మిక గర్జనలు, బహిరంగ సభలను నిర్వహిస్తోంది. ఇవాళ చలో సింగరేణికి పిలుపునిచ్చిన ఆ పార్టీ? సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వంపై ఎక్కుపెడుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పాటు బీజేపీ అనుబంధ సంఘాలు అలాగే లెఫ్ట్ పార్టీల అనుబంధ యూనియన్లు కూడా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. కార్మికుల

పార్టీలు కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. కార్మికుల ఓట్లను రాబట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ చర్యలపై దృష్టి సారించింది. కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, గృహ నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కారం వంటి హామీలతో కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దసరా పండగవేళ ప్రకటించిన భారీ బోనస్ కూడా తమకు కలిసొస్తుందని నమ్ముతోంది.ఇక.. ప్రతిపక్ష బీఆర్ఎస్ దూకుడు మీదుంది. గల్ఫ్, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తమకు మంచి పట్టు ఉందని ఆ పార్టీ నమ్ముతోంది. దాన్ని

సమస్యలపై గళం విప్పుతున్నాయి. మంచిర్యాల, చెన్నూరు, రామగుండం వంటి కోల్‌బెల్ట్ ప్రాంతాలు ప్రధాన రాజకీయ పార్టీల కార్యకలాపాలతో హోరెత్తుతున్నాయి.గతంలో సింగరేణి ప్రాంతంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన శక్తులు నేడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కేవలం వేతన ఒప్పందాలు, బోనస్‌లు మాత్రమే కాకుండా కార్మికుల సర్వతోముఖాభివృద్ధి, ఉద్యోగ భద్రత, జీవన ప్రమానాల మెరుగుదల ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాబోయే రోజుల్లో రానున్న సింగరేణి ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో రాబోయే పరిణామాలకు ఒక దిక్సూచిగా నిలవనున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కరెంట్ కోతలు.. అధికారులపై నెపమా రేవంత్?



**హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చేసిన తప్పులకు అధికారులను బాధ్యులను చేస్తూ సీఎం, మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందించారు. బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఏర్పాటు చేసుకోకపోవడం, విద్యుత్ రంగంపై సకాలంలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే కరెంట్ కోతల పరిస్థితి ఏర్పడిందని హరీశ్ రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు తొమ్మిది నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు పరిస్థితి తీవ్రం కావడంతో అధికారులను సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరించడం సరికాదన్నారు. నిషేధిత భూముల జాబితా అంశంలోనూ ప్రభుత్వమే తప్పులు చేసి అధికారులపై నెపం నెట్టిందని హరీశ్ రావు విమర్శించారు. విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే వైఖరిని అనుసరిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినోను కోవిడ్ తరహా విపత్తుగా సీఎం అభివర్ణించడాన్ని ప్రస్తావిస్తూ.. అలాంటి పరిస్థితి వస్తుందని ముందే హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదని ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్, బీజేపీ భారీ స్కెచ్!

-మొదటిపేజీ తరువాయి

ముందస్తుగా అప్రమత్తం చేసింది. మొత్తం 77 మందిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43 మందిని, నల్గొండ- వరంగల్- ఖమ్మం స్థానానికి 34 మంది ఇన్‌చార్జ్‌లను కేటాయించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో ఆయా ఎమ్మెల్యేలకే ఆ బాధ్యతలు అప్పగించడం ద్వారా క్షేత్రస్థాయిలో నాయకత్వ సమన్వయ లోపం రాకుండా జాగ్రత్త పడ్డారు. ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు అప్పగించారు. కొడంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యతను అనుముల తిరుపతిరెడ్డికి అప్పగించడం ద్వారా నాయకుల మధ్య జవాబుదారీతనం పెంచే ప్రయత్నం చేశారు.ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికలపై అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో నేతల పనితీరుపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, మొదటి స్థానానికే పూర్తి ప్రాధాన్యం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. మంత్రులు సైతం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆదేశించడం ద్వారా ఈ ఎన్నికలను కాంగ్రెస్ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపు ఓటములు ప్రధానంగా ఓటర్ల నమోదు ప్రక్రియపైనే ఆధారపడి ఉంటాయి. పట్టభద్రులు పెద్ద ఎత్తున ఓటర్లుగా పేరు నమోదు చేసుకునేలా చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ పోలింగ్ బూత్ వరకు రప్పించడం ప్రస్తుతం కాంగ్రెస్ ముందున్న ప్రధాన సవాల్. ఈ నేపథ్యంలోనే ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని నేతలను ఆదేశించారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంతో, ప్రచార సమన్వయంపై ఇన్‌చార్జ్‌లు దృష్టిసారించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలు రాబోయే రాజకీయ పరిణామాలపై, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయానికి అద్దం పడతాయని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. మేధావి వర్గంగా భావించే గ్రాడ్యుయేట్లు ఇచ్చే తీర్పు ప్రభుత్వానికి మరింత నైతిక బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి.. అధికారంలో ఉన్న జోరును గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ ప్రదర్శించి క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో జోష్ నింపాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ఇన్‌చార్జ్‌ల నియామకం, సీఎం రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచుతున్నాయి.

### రామచందర్ రావు వైపే మొగ్గు!

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది. ఈ కమిటీలు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాయి. ఇందులో ఒక స్థానానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైపే మెజారిటీ నేతలు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ కేడర్ మూడ్‌ను అంచనా వేయడానికి బీజేపీ హైకమాండ్ ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం విడివిడిగా రెండు కమిటీలను ఏర్పాటు చేసి మరీ కిందిస్థాయి అభిప్రాయాలను సేకరిస్తోంది. ముఖ్యంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఈ మూడు ఉమ్మడి జిల్లాల కీలక నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాల ఎంపికపై నేతలు తమ మనసులోని మాటను కమిటీ ముందుంచారు.ఈ అభిప్రాయ సేకరణలో మెజారిటీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత ఎన్.రామచందర్ రావు వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే స్థానం నుండి ప్రాతినిధ్యం వహించిన అనుభవం, పట్టభద్రులలో ఉన్న మంచి పేరు, లాయర్‌గా ఆయనకున్న ప్రజా మద్దతును నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. చాలా మంది నేతలు ఆయన పేరును మాత్రమే ప్రధానంగా సూచించినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నాయకుడికి మళ్లీ అవకాశం ఇస్తే గెలుపు మరింత సులభమవుతుందని కేడర్ గట్టిగా భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.మరోవైపు.. అభిప్రాయ సేకరణలో అందరూ ఏకాభిప్రాయంతో లేరని సమాచారం. కొంతమంది నాయకులు మాత్రం "పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా మాకు అభ్యంతరం లేదు, పార్టీ నిర్ణయమే శిరోధార్యం" అని స్పష్టం చేశారు. మరికొంత మంది మాత్రం ఒకవేళ రామచందర్ రావు కాకపోతే పలానా వ్యక్తికి అవకాశం ఇవ్వాలని ప్రత్యామ్నాయ అభ్యర్థుల పేర్లను సూచించారు. అయితే ఇలా సూచించిన వాళ్ళ సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.ఏది ఏమైనప్పటికీ, మెజారిటీ నాయకుల మద్దతు రామచందర్ రావు వైపు ఉండటంతో బీజేపీ వర్గాల్లో ఆయన పేరే ప్రధానంగా వినిపిస్తోంది. అభిప్రాయ సేకరణ కమిటీలు సేకరించిన ఈ నివేదికను త్వరలోనే రాష్ట్ర నాయకత్వం ద్వారా కేంద్ర పార్టీ అధిష్ఠానానికి నివేదించనున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న తరుణంలో, అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.



# పులి నేపథ్యంలో సాగే కథతో?

మెగా హీరో సాయిదుర్గతేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు' సినిమా చేస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత 'సేవ్ ది టైగర్స్'ఫేం తేజ కాకుమాను దర్శకత్వంలో సాయిదుర్గతేజ్ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇటీవలే క్లాప్ కొట్టారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నది. 'కాంతార'ఫేం సప్తమి గౌడ ఈ సినిమాలో కథానాయికగా ఖరారైంది. ఇదిలావుంటే.. ఈ సినిమా కథాంశం విషయంలో ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. అటవీ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పులి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందట. అందుకే.. పులికి సంబంధించిన సన్నివేశాలను ప్రీ విజువలైజేషన్ చేశారట. భారీ స్థాయిలో సీజీ వర్క్ అవసరమైన సినిమా ఇదని సమాచారం. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసిన తర్వాతే సెట్స్ పైకి వెళ్లాలని దర్శకుడు తేజ కాకుమాను ఫిక్స్ అయ్యారట. ఈ నెలాఖరునే తొలి షెడ్యూల్ మొదలవుతుందని తెలిసింది. తమన్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.



## మూవీ లవర్స్‌కు గుడ్ న్యూస్..
# వైజాగ్‌లో చిరంజీవి నయా ప్లాన్..!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. విశ్వంభర, కాకా సినిమాతోపాటు శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడు. కాగా చిరుకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. త్వరలోనే చిరంజీవి ఫిల్మ్ ఎగ్జిబిషన్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఏసియన్ సినిమాస్‌తో కలిసి హైదరాబాద్‌కు ఔశీతీశ్రీస'ం ఘ్రుతీస్త్రవర్ ూాఎతీవవఅ (ప్రపంచ అతిపెద్ద థియేటర్)ను తీసుకురాబోతున్నాడు. అంతేకాదు ఏపీలోని విశాఖపట్నం కొత్త మల్టీ స్క్రీన్ థియేటర్‌ను నిర్మించాలనే ప్లాన్ కూడా చేస్తున్నాడట. గరివిడి లక్ష్మి మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఏపీ మంత్రి గంటా శ్రీనివాస్ రావు ఈ వార్తను షేర్ చేశారు. చిరంజీవితో గంటా శ్రీనివాస్ రావుకు మంచి అనుబంధం ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవలే గంటా శ్రీనివాస రావు చిరంజీవిని కలవగా.. వైజాగ్‌లో న్యూ మల్టీప్లెక్స్ థియేటర్ విషయం తెరపైకి వచ్చింది. చిరంజీవికి కెరీర్ తొలినాళ్ల నుంచి వైజాగ్‌తో చాలా అటాచ్‌మెంట్ ఉందని తెలిసిందే. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో మల్టీప్లెక్స్ నిర్మించేందుకు ప్లాన్ చేయడం అక్కడి అభిమానులకు శుభవార్తే అని చెప్పాలి.

# ముగ్గురు హీరోయిన్లతో.. సందీప్ కిషన్



హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కరికాల' ఘనంగా ప్రారంభమైంది. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. భారీ ఊహా ప్రపంచం నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందనున్న ఈ సినిమాలో కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు ఆది సాయి కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

**కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా..**

ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ.. 'కరికాల' కథను రెండు భాగాలుగా చెప్పినా ఎక్కడా బోర్ అనిపించలేదని తెలిపారు. గత ఆరు, ఏడు నెలలుగా దర్శకుడు యుగంధర్ ముని ప్రీ ప్రొడక్షన్ కోసం ఎంతో కష్టపడుతున్నారని ప్రశంసించారు. ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు.

**తేదీలు ఖరారు**

'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మేకర్స్ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలి భాగం 2027 జూలై 2న, రెండో భాగం అదే ఏడాది అక్టోబర్ 28న విడుదల కానుంది. సందీప్ కిషన్ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటిస్తుండటం, నాగలోకం, వానర లోకం వంటి విభిన్న నేపథ్యాలు ఉండటం ఆసక్తిని పెంచుతున్నాయి.

# పెళ్లికి ఇంకా టైముంది!



గత కొన్నేళ్లుగా సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్నది మలయాళీ సోయగం అనుపమ పరమేశ్వరన్. మహిళా ప్రధాన చిత్రాలతో పాటు ప్రధానస్రవంతి చిత్రాల్లో కథానాయికగా రాణిస్తూ సత్తా చాటుతున్నది. తాజాగా ఈ భామ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, వీకే నరేష్ ప్రధాన పాత్రల్లో భద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం అనుపమ పరమేశ్వరన్ విలేకరులతో సినిమా సంగతుల్ని పంచుకుంది. ఈ సినిమాలో తాను స్వతంత్ర్య భావాలు కలిగిన కీర్తి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర ఇదని పేర్కొన్నది. ఆమె మాట్లాడుతూ 'తెలంగాణ పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిది. మా కేరళ వివాహ వేడుకల్లో పూర్తిగా శాకాహారమే వడ్డిస్తారు. కానీ తెలంగాణ పెళ్లిలో నాన్‌వెజ్ పెడతారని ఈ సినిమా ద్వారానే తెలుసుకున్నా. ఈ కథలో పాత్రలన్నీ స్ట్రగుల్ పడుతుంటాయి. కానీ వాళ్ల కష్టాల నుంచే మంచి కామెడీ పుడుతుంది' అని చెప్పింది. పెళ్లెప్పుడు చేసుకుంటారనే ప్రశ్నకు జవాబిస్తూ 'నా పెళ్లి విషయంలో మా పెరెంట్స్ నుంచి ఎలాంటి ఒత్తిడిలేదు. ఇష్టమైనప్పుడు చేసుకో అంటున్నారు. నా పెళ్లికి ఇంకా టైముంది అనుకుంటున్నా' అని చెప్పింది. 'క్రేజీ కల్యాణం'లోని కీర్తి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని, ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్నానని, అవన్నీ వేటికవే విభిన్నమైన పాత్రలని అనుపమ పరమేశ్వరన్ చెప్పింది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512